తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-25- ఏప్రిల్ 2025 | సంపుటి : 2 | సంచిక : 335 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# సరిహద్దుల్లో యుద్ధమేఘాలు

- సింధు జలాల నిలిపివేత కచ్చితంగా యుద్ధ ప్రకటనే పాక్ వ్యాఖ్య
- సరిహద్దుల్లో భారీగా మోహరింపులు
- రాష్ట్రపతితో అమిత్ షా కీలక భేటీ
- అతి త్వరలో 'నిర్ణాయక చర్యలు'?
- ప్రధాని హెచ్చరికల సారాంశమూ అదే!
- ముష్కరుల్ని వెంటాడి మట్టిలో కలిపేస్తాం



**న్యూఢిల్లీ,(తెలంగాణ ముచ్చట్లు):**

సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాక్ నడుమ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుతున్నాయి. తనకు జీవనాడి వంటి సింధు జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై పాక్ గంగవెర్రులెత్తిపోయింది. ఇది తమపై నేరుగా యుద్ధ ప్రకటనేనంటూ గగ్గోలు పెట్టింది. ప్రతీకారంగా నామమాత్రపు సిమ్లా ఒప్పందాన్ని సస్పెండ్ చేసి అక్కసు తీర్చుకుంది.

భారత్‌కు తన గగనతలాన్ని మూసేయడమే గాక వాణిజ్య సంబంధాలను పూర్తిగా తెంచుకుంటున్నట్టు ప్రకటించింది. ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధమంటూ బీరాలు పలికింది. ఎడాపెడా క్షిపణి పరీక్షలకు రంగం సిద్ధం చేసుకుంటోంది. సరిహద్దుల వెంబడి సైనిక మోహరింపులను కూడా యుద్ధ ప్రాతిపదికన భారీగా పెంచేస్తోంది.

మరోవైపు దాయాది ఎన్నటికీ మర్చిపోలేని రీతిలో 'నిర్ణాయక చర్య'లకు కేంద్రం సిద్ధమవుతున్నట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. గురువారం చోటుచేసుకున్న పలు కీలక పరిణా మా లు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ మధ్యాహ్నం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు.

మిగతా 2లో..

## ఊహకందని రీతిలో ప్రతీకారం: మోదీ

**పాట్నా, (తెలంగాణ ముచ్చట్లు):**



జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదులు సప్తసముద్రాల అవతల దాక్కున్నా సరే వెతికి మరి మట్టిలో కలిపేస్తాం. 140 కోట్ల మంది సంకల్పం ఉగ్రవాదుల్నే కాదు వారిని పెంచి పోషిస్తున్న ఉగ్రవాద నాయకుల వెన్ను విరిచేస్తుంది' అని హెచ్చరించారు.

ప్రధాని మోదీ గురువారం బీహార్‌లో పర్యటించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్ రాష్ట్రం మధుబని నగరంలో మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలను బలోపేతం చేసేందుకు వీలుగా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రూ.13,480 కోట్లకు పైగా వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు.


మిగతా 2లో..

## భూదాన్ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని ఉత్తర్వులు



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నం. 181, 182, 194, 195లో భూదాన్ భూములు అన్యాక్రాంతం కావడంలో పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు సహా కొందరు ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న పిటిషన్‌ను విచారించిన హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టింది. ప్రాథమికంగా రికార్డులను పరిశీలిస్తే నాగారం గ్రామంలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని పేర్కొంది. భూదాన్ భూముల అన్యాక్రాంతంలో ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రజా ఆస్తి పరిరక్షణ చర్యల్లో భాగంగా వాటిని నిషేధిత జాబితాలో చేర్చాలని జిల్లా కలెక్టర్, మహేశ్వరం, ఎల్బీనగర్ సబ్‌రిజిస్ట్రార్లలకు ఉత్తర్వులు జారీచేసింది.



మిగతా 2లో..



## ఆ దిశగానే భారత్ సమ్మిట్

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించబోయే భారత్ సమ్మిట్ లో వంద దేశాలకు సంబంధించిన 450 ప్రతినిధులు పాల్గొంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్ స్పష్టం చేశారు. భారతదేశం అలీనోద్యమం తీసుకొని ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని, ఆ దిశగానే సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు భట్టి విక్రమార్క.

గురువారంహెచ్ఐసీసీ నుంచి మాట్లాడిన భట్టి విక్రమార్క.. ' రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నాం.

మిగతా 2లో..

## డీపీఆర్ ఆమోదం రాకుండానే కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ఆమోదం పొందకముందే బ్యారేజీల నిర్మాణం చేపట్టారని నిపుణుల కమిటీ తేల్చింది. కాళేశ్వరం అంశాలపై ఎన్‌డీఎస్‌ఏ నివేదికను రూపొందించి.. రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలపై అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ.. తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారికి ఎన్‌డీఎస్‌ఏ ఛైర్మన్ అనిల్ జైన్ లేఖ రాశారు.

"బ్యారేజీల నిర్మాణంలో నీటిపారుదలశాఖ ఉల్లంఘనలకు పాల్పడింది.

మిగతా 2లో..



## రెండు రోజులు వడగాల్పులు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో భానుడి సెగలు పెరుగుతున్నాయి. రానున్న మూడు రోజుల పాటు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రానున్న రెండు రోజుల పాటు పగలు వడగాల్పులు, రాత్రివేళల్లో వేడి వాతావరణం నమోదవుతుందని వెల్లడించింది."నిజామాబాద్ జిల్లాలో బుధవారం అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కన్నా 3.6 డిగ్రీలు ఎక్కువ. ఆదిలాబాద్ జిల్లాలో 44.3, మెదక్‌లో 43.4, రామగుండంలో 42.8, ఖమ్మం జిల్లాలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి" అని తెలిపింది.



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్..

### 1000 మంది మావోయిస్టులను చుట్టుముట్టిన 20వేల బలగాలు..!



**ఛత్తీస్‌గఢ్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద యాంటీనక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపూర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు.

మిగతా 2లో..

## నాడు మురిసిన పల్లెలు.. నేడు కన్నీరు

- కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం గాడితప్పింది: మాజీ మంత్రి కేటీఆర్
- కేసీఆర్ పదేండ్ల పాలనలో గ్రామాల్లో స్వర్ణయుగం

**హైదరాబాద్, ( తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలన.. గ్రామస్వరాజ్యంలో స్వర్ణయుగమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సరిహద్దుల్లో యుద్ధమేఘాలు



(మొదటి పేజీ తరువాయి)

గురువారం శ్రీనగర్‌లోని మార్కెట్ ప్రాంతంలో భద్రతా దళాల గస్తీ
తాజా పరిస్థితిని వివరించడంతో పాటు పలు 'ఇతర' అంశాలపైనా చర్చించినట్టు చెబుతున్నారు. ప్రధాని మోదీ కూడా పహల్గాం ముష్కరులకు బహిరంగంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. ''ఎక్కడ దాక్కున్నా ప్రపంచపు అంచుల దాకా వెంటాడి మరీ వాళ్లను మట్టిలో కలిపేస్తాం. వారికి దన్నుగా నిలిచిన దుష్టశక్తినీ కఠినంగా శిక్షిస్తాం.
కలలోనైనా ఊహించలేని స్థాయిలో ప్రతీకారం తీర్చుకు ని తీరతాం'' అంటూ ప్రతినబూనారు. తర్వాత కా సేపటికే 'ఆక్రమణ్' పేరిట సైన్యం భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించింది. అత్యాధునిక రఫేల్‌తో పాటు సుఖోయ్ తదితర యుద్ధ విమానాలు ఇందులో పాల్గొన్నాయి. మరోవైపు పాక్‌లో ఉన్న భారతీయులు తక్షణం తిరిగి రావాలంటూ కేంద్రం అడ్వైజరీ జారీ చేసింది.
పొరుగు దేశాన్ని అంతర్జాతీయ వేదికలపై ఏకాకిని చేయడమే గాక దానిపై తీసుకోబోయే 'కఠిన' చర్యలకు జీ20 తదితర దేశాల మద్దతు కూడగడుతోంది. పహల్గాం ఆటవిక దాడి, అందులో పాక్ ముష్కరులు పాల్గొన్న వైనం తదితరాలను జీ20 సభ్య దేశాల రాయబారులకు విదేశాంగ శాఖ పూసగుచ్చినట్టు వివరించింది. భేటీకి హాజరైన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల రాయబారులు దాడిని తీవ్రంగా ఖండించాయి. పాక్‌కు కరుడుగట్టిన మద్దతుదారైన చైనా కూడా భేటీలో పాల్గొనడమే గాక భారత్‌కు మద్దతు పలకడం విశేషం. మరోవైపు పహల్గాం దాడి, తదనంతర పరిస్థితులను కాంగ్రెస్ తదితర పార్టీలన్నింటితో కేంద్రం పంచుకుంది. ఉగ్ర తండాలను శాశ్వతంగా నిర్మూలించి తీరాల్సిందేనని పార్టీలన్నీ ముక్తకంఠంతో అభిప్రాయపడ్డాయి. అందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా అండగా నిలుస్తామని అఖిలపక్ష భేటీలో ప్రకటించాయి. అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణులతో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, దానికి తోడుగా యుద్ధనౌక ఐఎన్ఎస్ సూరత్ పాక్ దిశగా కదులుతున్నట్టు సమాచారం.

# ఊహకందని రీతిలో ప్రతీకారం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

సభలో మాట్లాడానికి ముందు పహల్గాం బాధితులకు రెండు నిమిషాల కళ్లు మూసుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించారు.
'పహల్గాం ఉగ్ర దాడిలో అమాయకులు చనిపోయారు. దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకుంటాం. టెర్రరిస్టులకు తగిన గుణపాఠం చెప్తాం. ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది. కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ దుఃఖం, ఆగ్రహం ఉన్నాయి. ఈ దాడి కేవలం అమాయక పర్యాటకులపై మాత్రమే కాదు. భారత దేశ ఆత్మపై దాడి జరిగింది. దాడి చేసిన ఉగ్రవాదులు, దానికి కుట్ర పన్నిన వారికి మనం విధించే శిక్ష వారి ఊహకి కూడా అందదు. జమ్మూకశ్మీర్‌లోనే కాదు దేశంలో ఉగ్రవాదాన్ని నాశనం చేసేందుకు సమయం ఆసన్నమైంది. 140 కోట్ల మంది సంకల్పం ఉగ్రవాద నాయకుల వెన్ను విరిచేస్తుందన్నారు.



**సప్త సముద్రాల వెనుక దాక్కున్నా సరే**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నేను ప్రపంచం మొత్తానికి హామీ ఇస్తున్నా. భారత్ ప్రతి ఉగ్రవాదిని, వారికి వెనక ఎవరు ఉన్నా సరే వారిని గుర్తిస్తుంది. శిక్షిస్తుంది. ఉగ్రవాదులు సప్త సముద్రాల వెనుక దాక్కున్నా సరే వెంబడించి మరి మట్టిలో కలిపేస్తాం. ఉగ్రవాదం దేశ స్ఫూర్తిని ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదు. ఉగ్రవాదానికి తప్పక శిక్ష పడుతుంది. న్యాయం జరిగేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సంకల్పంలో మొత్తం దేశం దృఢంగా ఉంది. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మనతో ఉన్నారు. ఈ సమయంలో మనతో పాటు నిలిచిన ప్రపంచ దేశాల ప్రజలకు, వారి నాయకులకు నా కృతజ్ఞతలు'అని అన్నారు.

# నాడు మురిసిన పల్లెలు.. నేడు కన్నీరు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో 3శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లె ప్రగతిలో 30శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒకరి విజయమని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు మురిసిన పల్లెలు.. కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పిందని గురువారం ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. పదేండ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమే కాకుండా గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా కేసీఆర్ సాకారం చేశారని గుర్తుచేశారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకొంటున్న వేళ.. పల్లెసీమ లేదేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మాగాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణంపోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిదని పేర్కొన్నారు.



**నాడు పల్లెలు సకల సౌకర్యాల హరివిల్లులు**

'కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతి సీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేకుండా పోయింది. కూలిపోయే స్థితిలో ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికికాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేండ్ల పాలనలో శాశ్వత పరిష్కారం లభించింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం ఒక స్వర్ణయుగం! పచ్చదనానికి కొదువలేకుండా, నిధులకు కొరతలేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది మన కేసీఆర్ విజన్!' అని కేటీఆర్ కొనియాడారు.

# ఘనంగా సంగీత మరియు భరతనాట్య నృత్య వేడుకలు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రం లో కైరలీ అకాడమీ వారి 9వ వార్షికోత్సవ వేడుకలు పిల్లలు, తల్లితండ్రుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పిల్లలచే చేపట్టిన భరతనాట్య సంగీత కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమము నందు హార్వెస్ట్ టెండర్ రూట్స్ స్కూల్ విద్యార్థిని చిరంజీవి రాచకొండ నిధి శ్రీ నందన చే భరతనాట్య నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచినది.



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్..

(మొదటి పేజీ తరువాయి)

ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.
బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల
నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.



గాలింపు చర్యల్లో డీఆర్జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. 48 గంటలుగా ఈ కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 3 వేల మందితో కూంబింగ్ చేపట్టగా..గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. దీంతో ఈ 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. అయితే, భద్రతా బలగాల సంఖ్య 20వేల వరకు ఉంటుందని పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బస్తర్, అబూజ్‌బడ్ దండకారణ్యంపై హిడ్మాకు పూర్తి అవగాహన ఉంది. అతడి టార్గెట్‌గానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. హిడ్మాతో పాటు మావోయిస్టు బెటాలియన్ చీఫ్ దేవాను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది.

# ఆ దిశగానే భారత్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం గం. 7.30ని.ల నుంచి గం.10.30 ని.ల వరకూ ఎన్ఆర్జీసీ పథకం ఫీల్డ్ విజిటింగ్ చేస్తాం.
తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం వివరిస్తాం. 2:45 నుంచి 4 గంటల వరకు తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్ కోసం ఏం చేస్తుందనేది వివరిస్తాం. వివిధ దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్న సమయంలో శాంతిని నింపేందుకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుంది.
ఎల్లుండి (శనివారం) సాయంత్రం ఇందిర మహిళ శక్తి బజార్ శిల్పకళ వేదిక సందర్శిస్తాం. పెహల్గామ్ ఉగ్రదాడి దురదృష్టకర సంఘటన. ఈ ప్రాంతాన్ని రేపు రాహుల్ గాంధీ సందర్శిస్తారు. అనంతరం భారత్ సమ్మిట్ కి రాహుల్ గాంధీ హాజరు అవుతారు. అహింస, సత్యాగ్రహ పద్ధతి ప్రపంచం పాటించాలని కోరుకుంటున్నాం. భారత్ సమ్మిట్ ద్వారా వివిధ దేశాల ప్రతినిధులు తెలంగాణకి వస్తారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న వనరుల వివరిస్తాం. న్యాయం అన్ని వర్గాలకు దక్కాలనేది కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు. మా ప్రభుత్వం ద్వారా ప్రపంచానికి ఈ మూల సిద్ధాంతం తెలియజేస్తాం. ప్రగతిశీల భావజాలం ఉన్న, న్యాయ సిద్ధాంతం ఉన్న పార్టీలను ఈ సమ్మిట్ కి ఆహ్వానిస్తాం' అని భట్టి పేర్కొన్నారు. భారత్ ఫౌండేషన్ సహకారంలో ఈ నెల 25, 26వ తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో భారత్ సమ్మిట్ 2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

## భూదాన్ భూములను
# నిషేధిత జాబితాలో చేర్చాలని ఉత్తర్వులు



(మొదటి పేజీ తరువాయి)

ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు వీలుగా ఏ ఒక లావాదేవీని జరపడానికి వీల్లేదని తేల్చిచెప్పింది.
ఈ భూబాగోతంలో ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించరాదని రిజిస్ట్రీని ఆదేశించింది. కీలక నిర్ణయాలు తీసుకొనే అధికారులపైనే తీవ్ర అభియోగాలు ఉన్నందున ఈ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి ఆస్కారం ఇవ్వబోమని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రయోజనాల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఆ అధికారులకు అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా మధ్యంతర ఉత్తర్వులను జారీచేస్తున్నట్టు ప్రకటించింది. భూదాన్, గ్రామదాన చట్టం ప్రకారం దాతలు ఇచ్చిన భూదాన్ భూములను పేదలకు వ్యవసాయం, ఇండ్ల నిర్మాణాలకు కేటాయించాల్సి ఉందని గుర్తుచేసింది. ఈ భూములు వారసత్వంగా కొనసాగించవచ్చని పేర్కొంది. అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాసర్‌రెడ్డి గురువారం కీలక ఉత్తర్వులు జారీచేశారు.

**ఫిర్యాదులపై చర్యలు శూన్యం**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గత ఫిబ్రవరి, మార్చిల్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ స్థానికుడు బిడ్డ మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ వాదనలు వినిపిస్తూ సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున సీబీఐ, ఈడీ దర్యాప్తునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. భూదాన్ చట్టం, తెలంగాణ భూదాన్, గ్రామదాన నిబంధనలు 1965కు విరుద్ధంగా సొంత పేర్లతోపాటు కుటుంబసభ్యుల పేర్లతో కొనుగోలు చేశారని తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు, ఈ ఏడాది మార్చి 8న సీఎంవో కార్యాలయంతోపాటు హోంశాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రాలు పంపినప్పటికీ చర్యలు శూన్యమని తెలిపారు.
ఏపీ, తెలంగాణల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున కేంద్రానికి చెందిన డీవోపీటీ, హోంశాఖలకు జనవరి 13న ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు. పోలీసులు, అధికారులు ఫోర్జరీ పత్రాలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని తెలిపారు. బినామీ లావాదేవీలు నిర్వహించడంతో చట్టవిరుద్ధంగా భూదాన్ భూములను అక్రమంగా బదలాయింపులు చేశారని ఆరోపించారు. భూదాన్ భూముల బదలాయింపు, అన్యాక్రాంతంపై నిషేధం ఉన్నప్పటికీ అధికారులు రికార్డులను తారుమారు చేశారని అన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లు చేర్పించుకుని పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా పొందారని తెలిపారు. అక్రమాలను బయటపెట్టిన పిటిషనర్లకు హాని తలపెట్టే అవకాశం ఉన్నదని, రక్షణ కల్పించాలని కోరారు.

**ఐఏఎస్, ఐపీఎస్‌లకు నోటీసులు**

ప్రతివాదులైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, భూదాన్ యజ్ఞ బోర్డు, సీసీఎల్ఏతోపాటు సీబీఐ, ఈడీలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వాళ్ల కుటుంబ సభ్యులకు, ఇతర అధికారులకు కూడా నోటీసులు జారీచేసింది.
ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు నవీన్ మిట్టల్, జ్ఞానముద్ర (సోమేశ్‌కుమార్ భార్య), పావనీరావు (రిటైర్డ్ ఐపీఎస్ ప్రభాకర్‌రావు భార్య), ఐశ్వర్యరాజు (ఈ వికాస్‌రాజు భార్య), వసుంధర సిన్హా, ఏకే మొహంతి, ఓం అనిరుధ్ (ఐపీఎస్ అధికారి రాచకొండ కమిషనర్ కొడుకు), నందిన్‌మాన్ (ఐపీఎస్ విక్రమ్‌సింగ్‌మాన్ భార్య), రీటా సుల్తానియా (ఐఏఎస్ సందీన్‌సుల్తానియా భార్య), రాధిక (ఐపీఎస్ కమలాసన్‌రెడ్డి భార్య), నితేశ్‌రెడ్డి (మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కొడుకు), ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, రవి గుప్తా, తరుణ్‌జోషి, తోట శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, రాహుల్ హెగ్డే, రేఖా షరాఫ్ (ఐపీఎస్ ఉమేశ్‌షరాఫ్ భార్య), రేణుగోయల్ (డీజీపీ జితేందర్ భార్య), దివ్యశ్రీ (ఐఏఎస్ ఆంజనేయులు భార్య), హేమలత (ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి భార్య), ఇందూరావు కే (ఐపీఎస్ లక్ష్మీనారాయణ భార్య), సవ్యసాచి ప్రతాప్‌సింగ్ (ఐపీఎస్ గోవింద్‌సింగ్ కొడుకు), రాహుల్ (రిటైర్డ్ ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కొడుకు), వరుణ్ (ఐపీఎస్ విశ్వప్రసాద్ కొడుకు), రిటైర్డ్ డీజీపీ అనురాగ్ శర్మ, ఐఏఎస్‌లు అమోయ్‌కుమార్, రాజశ్రీ హర్ష, అజయ్‌జైన్, ఇతర అధికారులు, ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వారందరికీ అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు.

**నిషేధిత జాబితాలోకి భూములు**

వాదనల తర్వాత హైకోర్టు..నాగారంలోని 181,182,194,195 సర్వే నంబర్లలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారి ప్రయోజనాల రక్షణల్లో అధికార దుర్వినియోగానికి అవకాశం ఉంటుందని సందేహం వ్యక్తంచేసింది. కాబట్టి తమకున్న విచక్షణాధికారాలను వినియోగించి ఈ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు సర్వే నం. 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిలా కలెక్టర్, సబ్‌రిజిస్ట్రార్‌లకు ఉత్తర్వులు జారీచేస్తున్నట్టు ప్రకటించింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఈ భూముల్లో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదని షరతు విధించింది.
భూదాతల అభీష్టానికి అనుగుణంగా అవి వ్యవసాయం చేసుకునేందుకు మాత్రమే వినియోగించేందుకు పేదలకు కేటాయించవచ్చని పేర్కొంది. లేనిపక్షంలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు ప్రజాఅవసరాలకు, బలహీనవర్గాల ఇండ్ల నిర్మాణానికి వాడుకోవచ్చునని తెలిపింది. భూదాన్ నిబంధన 3 ప్రకారం కేటాయింపులు వారసత్వంగా ఇవ్వవచ్చనని కూడా పేర్కొంది. అంతేగాని అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని స్పష్టంచేసింది. తదుపరి విచారణను జూన్ ఒకటికి వాయిదా వేసింది.

# డీపీఆర్ ఆమోదం రాకుండానే కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక పరీక్షలు లేకుండానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్‌లు మార్చారు. బ్యారేజీలో నిర్వహణ లోపాలే సమస్యలు తెచ్చిపెట్టాయి. తొలి ఏడాదిలో సమస్య తలెత్తినా.. మరమ్మతులలో జాప్యం జరిగింది. డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని పాటించకపోవడంతో సమస్యలు పెరిగాయి. మేడిగడ్డ 7వ బ్లాక్ కింద పెద్ద గొయ్యి ఏర్పడటంతో పియర్ దెబ్బతింది. సికెంట్ ఫైల్ కటాఫ్స్‌లో నాణ్యత లేకపోవడం పియర్ కుంగడానికి కారణమైంది. నాణ్యతాలోపం కారణంగా ఎగువ, దిగువన కటాఫ్ సిస్టమ్ విఫలమైంది.
మేడిగడ్డలోని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలి. డిజైన్, నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయి. 3 బ్యారేజీలకు సంబంధించి పూర్తిగా పరీక్షలు జరగాలి. జియో టెక్నికల్, జియో ఫిజికల్ అధ్యయనాలు చేయాలి. హైడ్రాలిక్ మోడల్ స్టడీస్ చేపట్టాలి. అధ్యయనానికి ముందే గ్రౌంటింగ్‌తో అంచనా ఇబ్బందిగా మారింది. ఎనర్జీ డిసిపేషన్, నిర్మాణ అంశాలను సరిపడా డిజైన్ చేయలేదు. అన్ని బ్యారేజీలకు కటాఫ్ వాల్ అంశాలు ఆందోళనకరంగా ఉన్నాయి. దీర్ఘకాలిక భద్రత కోసం సమష్టిగా అన్ని విభాగాలు చర్యలు చేపట్టాలి'' అని ఎన్‌డీఎస్ఏ తన నివేదికలో పేర్కొంది.

# రైతు శ్రేయస్సు కోసమే భూ భారతి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.. భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.. ప్రతి రైతు భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి**

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,





భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నూతన భూ భారతి ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం, మెదక్ జిల్లాలోని నిజాంపేట మండల కేంద్రంలో రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు ను నిర్వహించారు. సదస్సుకు ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి ఎంపీఓ ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రజలు అడిగిన పలు సమస్యలను జిల్లా కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందన్నారు. రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి, అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఈ భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. భూ సమస్యలపై రైతులు మీసేవాలో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ధరణిలో అప్పీల్ చేయడానికి అవకాశం లేదని సివిల్ కోర్టుకు వెళ్లాలని ఈ భూ భారతి చట్టంలో తహసీల్దార్ నుంచి ఆర్డీఓ, ఆర్డీఓ నుంచి కలెక్టర్, కలెక్టర్ నుంచి ల్యాండ్ ట్రిబ్యునల్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా భూ భారతి అవగాహన సదస్సులను పూర్తిచేసుకుంటామని, మే 1వ తేదీన జిల్లాలోని ఒక మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించుకుంటామని, జూన్ మొదటి వారంలో ఈ భూ భారతి చట్టం జిల్లా మొత్తం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో గ్రామ సభలు నిర్వహించి, రైతుల నుంచి తమ సమస్యల వివరాలను సేకరించడం జరుగుతుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతు సంఘాల నాయకులు, సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.




## కామేపల్లి మండలంలో వరుసగా
# వివాహ వేడుకలు

**శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య మేకల మల్లిబాబు యాదవ్**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

కామేపల్లి మండలం బండిపాడు గ్రామానికి చెందిన చల్లా రవీందర్ కళావతి కుమారుడు కార్తీక్ చిత్ర లేఖ ల ఆదర్శ వివాహం స్థానిక శివాలయంలో జరగగా వివాహ విందు కార్యక్రమంలో మరియు మరియు కామేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు దొడ్డిగర్ల సుందరం మరియమ్మ దంపతుల కూతురు చి.మానస వివాహ నిశ్చితార్థ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తో పాటు పండితాపురం గ్రామానికి చెందిన కొజ్జా నాగులు మంగమ్మ ల కుమారుడైన వీరబాబు మహేశ్వరిల వివాహం బుధవారం నాడు జరగగా గురువారం రోజు జరిగిన వివాహ రిసెప్షన్ లో మరియు కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగిన దారణ లక్ష్మీనారాయణ పద్మల కుమారుడు చి. సాద్వి, చి. రాజశ్రీ లకు జరిగిన వోణి, పంచ కట్టు వేడుకలలో మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ , మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డిపాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి కలకాలం చల్లగా ఉండాలని, పంచ కట్టు వేడుక జరుపుకున్న చిరంజీవు లకు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి సత్యం, రాం రెడ్డి జగన్నాథ్ రెడ్డి నల్లమోతు లక్ష్మయ్య భూక్య నాగేంద్రబాబు పాటిబండ్ల ప్రసాదు చిలమర్తి ఉపేందర్, రామచంద్రు,బత్తుల వీరబాబు, మొగిలి శ్రీను , బండి నాగరాజు, జన్నారపు లింగయ్య మంజల రామకృష్ణ, బత్తుల రాంబాబు, బావ్ సింగ్, రమేష్ సొందు, గుగులోతు మంజ గుగులోతు కిషన్ గుగులోతు పంతులు, బానోతు తులిశ్య, గుగులోతు లచ్చిరాం, గుగులోతు రవి మరియు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.





## ఇంటర్మీడియట్‌లో అద్భుత ప్రతిభను కనబరిచిన
# రజితకు అభినందన

**డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి ఏఐసీసీ నేషనల్ హెడ్ (హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్)**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి తిరుపతయ్య కుమార్తె రజిత 800 మార్కులతో సత్తా చాటుంది. ఈ నేపథ్యంలో గురువారం ఏఐసీసీ నేషనల్ హెడ్(హెల్త్ కేర్ ప్రొఫెషనల్) డాక్టర్ జిల్లేల ఆదిత్య రెడ్డి కాంగ్రెస్ కార్యకర్త తిరుపతయ్య స్వగృహానికి వెళ్లి ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటిన రజితను శాలువాతో సన్మానించి అభినందించారు. విద్యార్థిని రజిత మరింత ఉన్నత చదువులు చదివి ఉత్తమ భవిష్యత్తును అందుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఉన్నత చదువులతో రాణించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని శిక్షించారు. రజిత పై చదువుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు జిల్లెల ఆదిత్య రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, ఎఐసిసి జిల్లా ఉపాధ్యక్షులు నాగార్జున, వనపర్తి మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్, మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి, మండల ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి, మండల సోషల్ మీడియా సొప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలి

**వెల్టూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లక్ సురేష్ కుమార్**




**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** ఈనెల 27న వరంగల్లో నిర్వహించే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మండలం నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పెద్దమందడి మండలం వెల్టుర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లు మల్లక్ సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మల్లక్ సురేష్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రసాధన కోసం పుట్టిన పార్టీ బిఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కెసిఆర్ అధ్యక్షతన వరంగల్లో రజతోత్సవ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని అన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ బ్యూరో / టేక్మాల్ తెలంగాణ ముచ్చట్లు:** జిల్లాలోని టేక్మాల్ మండల పరిధిలో గురువారం ఎలకుర్తి, చల్లపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సందర్శించి, కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పర్యవేక్షించి, కొనుగోళ్ల రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల పూర్తి వివరాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తైన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని సూచించారు. ఈకార్యక్రమంలో టేక్మాల్ తాసిల్దార్ తులసీరామ్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతి హాస్పిటల్‌కు ఐఎస్ఓ, ఎన్ఏబిహెచ్ గుర్తింపు






**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం పట్టణం నెహ్రూ నగర్ లోని ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఐఎస్ఓ, ఎన్ఏబిహెచ్ గుర్తింపును పొందినట్లు హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ కేసోజ్ భారత్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నల్గొండ, కృష్ణా జిల్లాలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తూ పేద మధ్యతరగతి ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించామని పేర్కొన్నారు. అందరికీ అతితక్కువ ఫీజులుతో వైద్యం చేసినందుకు యాజమాన్యాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అభినందిస్తూ ఐఎస్ఓ డైరెక్టర్ అభినందనలు తెలిపారని డాక్టర్ భరత్ బాబు తెలిపారు. నాణ్యత, నిజాయితీ నిబద్దత కలిగిన వైద్యులు ఉండడంతో ప్రశాంతికి అరుదైన గౌరవం లభించిందని ఈ సందర్భంగా వైద్యులకు డాక్టర్ భరత్ బాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ లో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ బసవయ్య చౌదరి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ హేమంత్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ జీవన్ కుమార్, మేనేజర్ చింతోజు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు హసన్ పర్తి ఇన్ స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. సుమారు 5055 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఎల్లాపూర్ కు చెందిన తిరుపతిరెడ్డి ఇంటి సమీపంలో మృతి చెందినట్లు గుర్తించామని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు ఎంజీఎం పోస్టుమార్టం లో కానీ హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో కానీ సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని ఇన్ స్పెక్టర్ చేరాలు తెలిపారు.



# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

**మాజీ ఎంపీ నామ**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:



వరంగల్, ఎల్కతుర్తిలో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఘనంగా జరిపేలా అందరూ కృషి చేయాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సభలో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాల్గొని తెలంగాణ ప్రజలకు భవిష్యత్ దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని నామ తెలిపారు. కొత్త ఆలోచనలు, ప్రజా సమస్యలపై సమగ్ర పరిష్కార మార్గాలను ఈ సభలో కేసీఆర్ వెల్లడించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఐటీ, పారిశ్రామిక అభివృద్ధి నాడు రాష్ట్రానికి తీసుకు వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు నూతన తెలంగాణకు నాంది పలికినట్టు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. బస్సులు, ఇతర వాహనాల ద్వారా ప్రజలను తరలించేలా ఏర్పాట్లు ఆయా నియోజకవర్గ ఇంచార్జిల ఆధ్వర్యంలో చురుకుగా కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోన్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా గత రెండు దశాబ్దాల విజయాలను ప్రజల ముందుంచే ప్రసక్తి ఉందని ఆయన పేర్కొన్నారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు అంతా ఈ సభకు హాజరవ్వాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీని ఒక ఉద్యమంగా భావించి, నిండు హృదయంతో ప్రతి కార్యకర్త ఈ సభ విజయానికి తన వంతు భాగస్వామ్యం అందించాలన్నారు. ఇది ఒక సాధారణ సభ కాదు, తెలంగాణ ప్రజల భవిష్యత్ కు దారి చూపించే వేదికగా నిలుస్తుందన్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిని మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ దారుణ ఘటన యావత్ దేశ ప్రజల్ని కలచివేసింది, విషాదంలో ముంచిందన్నారు. ఈ దాడి దేశ భద్రతపై జరిగిన దారుణమైన దాడిగా అభివర్ణించారు. పర్యాటకులపై ఇలాంటి పాశవిక చర్యలు మానవత్వానికి మచ్చలుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారికి త్వరితంగా మెరుగైన వైద్యం అందించాలని కోరారు. దేశ భద్రతను దెబ్బతీయాలన్న ఉగ్రవాదుల కుట్రలు ఎన్నిసార్లు చేసినా, భారత ప్రజల ఐక్యతను, మన సైనిక బలాన్ని తలదన్నలేవని నామ స్పష్టం చేశారు. ఈ దాడికి బాధ్యులైన ఉగ్ర మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత భద్రతా బలగాలు ఎప్పటికప్పుడు దేశాన్ని కాపాడడంలో చేస్తున్న త్యాగాలను కొనియాడారు.



## పోలీస్ శాఖలో పదోన్నతులు
# బాధ్యతను పెంచుతాయి

- **పోలీసులు నిజాయితీగా ప్రజలకు సేవలు అందించాలి**
- **వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి తెలంగాణ ముచ్చట్లు:** పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యత పెంచుతాయని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. పోలీస్ శాఖలో నిరంతరంగా సేవలు అందించి గురువారం పదోన్నతి పొందిన ఖిల్లా ఘనపుర్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ ఎం సుధాకర్ ఎస్సైగా, వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ ఎన్ రాజా గౌడ్ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన పోలీస్ సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిజను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పదోన్నతి పొందిన పోలీసులకు ఎస్పీ పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి పొందిన పోలీసు సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ అదనపు ఎస్పీ మహేశ్వర రావు, పదోన్నతి పొందిన ఎస్సై సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ రాజా గౌడ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నూతన ఆర్.ఓ.ఆర్ -భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం..

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- డిజిపిఎస్ సర్వేతో నూతన భూ కొలతలు
- లక్షకు పైగా పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం
- నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం రైతు వేదికలో నిర్వహించిన తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల) చట్టం-2025 రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్.ఓ.ఆర్. భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

గురువారం నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం రైతు వేదిక వద్ద నిర్వహించిన తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల) చట్టం2025 రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం సభ్యులు, అడ్వకేట్ సునీల్ లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ భూమి స్వభావం, కొలతలు, ఎక్కడ ఉంది తేలితేనే భూ సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.

1910 నుంచి 1930 వరకు నైజాం కాలంలో భూ సర్వే జరిగిందని అన్నారు. భూ సమస్యల పరిష్కారం సర్వేతోనే సాధ్యం అవుతుందని, భూ సర్వేను భూ భారతి చట్టంలో పొందుపర్చడం జరిగిందని అన్నారు. జి.పి.ఎస్. సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి సర్వేయర్లను కేటాయించి సర్వే పూర్తి చేస్తామని, మండలంలో సర్వేయర్ సర్వే సరిగా జరిగినట్లు ధృవీకరణ జరుపుతారని అన్నారు.

భూమి కొలతలు, ఎక్కడ ఉందో తెలిసిన తర్వాత యాజమాన్య హక్కు తేల్చాల్సి ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో సుమారు లక్ష పైగా సాదా బైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీరికి పట్టాలు అందించేందుకు భూ భారతి చట్టంలో సౌలభ్యం కల్పించామని అన్నారు.

వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ చేసే ముందు తప్పనిసరిగా కుటుంబ సభ్యులందరికీ నోటీసులు జారీ చేయాలని, తర్వాత మాత్రమే భూ హక్కుల బదలాయింపు జరగాలని కొత్త చట్టంలో చేర్చుకున్నామని, దీని వల్ల వివాదాలకు తావు లేకుండా ఉంటుందని అన్నారు.

భూ హక్కుల రికార్డుల్లో తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునేందుకు గతంలో సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ కోర్టులను ప్రవేశ పెట్టిందని అన్నారు. నిర్దేశిత సమయంలో ప్రజలకు సేవలు అందేలా చట్టంలో అధికారులపై బాధ్యత పెట్టడం జరిగిందని అన్నారు. భూ హక్కుల రికార్డు మ్యూటేషన్ దరఖాస్తులను 30 రోజుల లోగా పూర్తి చేయాలని, చేయని పక్షంలో దరఖాస్తు ఆటోమేటిక్ గా ఆమోదం పొందుతుందని అన్నారు.

భూ భారతి చట్టంపై అడ్వకేట్ సునీల్ మాట్లాడుతూ, ధరణి వ్యవస్థ వల్ల వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం 2025 ఏప్రిల్ 14న నూతన ఆర్.ఓ.ఆర్. భూ భారతి చట్టం తీసుకొని వచ్చిందని అన్నారు. భూ భారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని, చట్టం ప్రకారం మనం దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం త్వరగా సాధ్యం అవుతుందని అన్నారు.

భూ హక్కుల రికార్డు సవరణ కోసం భూ భారతి చట్టం సెక్షన్ 4 సబ్ సెక్షన్ 5, 6 ప్రకారం దరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లోగా పరిష్కారం అవుతుందని, గతంలో ఏమైనా సవరణలు చేయాలంటే సివిల్ కోర్టుకు వెళ్ళాల్సి ఉండేదని అన్నారు.

తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన సాదా బైనామా భూముల పట్టాలు అందించాలని గత ప్రభుత్వం తీసుకున్న దరఖాస్తుల పరిష్కారంపై ధరణిలో అవకాశం లేనందున హైకోర్టు స్టే విధించిందని, 9 లక్షల 24 వేల పెండింగ్ సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టం సెక్షన్ 6 క్రింద ఆర్డిఓ లకు బాధ్యతలు అందించిందని అన్నారు.

చిన్న సన్న కారు రైతులు 2014 కంటే ముందు కొనుగోలు చేసిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు మాత్రమే సాదా బైనామా పట్టా లభిస్తుందని అన్నారు. గడిచిన 12 ఏళ్ళలో సాదా బైనామా భూముల అనుభవంలో ఉన్న వారికి మాత్రమే దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అన్నారు.

మన సేల్ డీడ్ మనమే రాసుకోవచ్చని, మ్యూటేషన్ పై ఏదైనా అభ్యంతరం ఉంటే ఆర్డిఓ దరఖాస్తు చేసుకోవాలని, ఆర్డిఓ ఇచ్చే పరిష్కారంపై సంతృప్తి లేకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేయవచ్చని తెలిపారు. భూమి పటం ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని, ప్రతి మండలంలో లైసెన్స్ సర్వేయర్ ఉంటారని, అతనితో భూ సర్వే చేయించి పటం తయారు చేసుకోవాలని అన్నారు.

వారసత్వం ప్రకారం ధరణిలో విచారణ లేకుండా పట్టాలు జరిగేవని, నేడు భూ భారతి చట్టం ప్రకారం తహసిల్దార్ దరఖాస్తు అందించిన 30 రోజులలోగా విచారణ చేసి పట్టాలు అందించాలని, లేకపోతే 31 వ రోజు ఆటోమేటిక్ గా పట్టా వస్తుందని అన్నారు .

రాబోయే రోజుల్లో వచ్చే భూముల సమస్య పరిష్కారం కోసం భూమి వివరాలు తెలిపేలా భూదార్ నెంబర్ వ్యవస్థ ఏర్పాటు అవుతుందని అన్నారు. భూ హక్కుల రికార్డుపై అప్పీల్ లో వచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే కోర్టులో కేసు వేసేందుకు న్యాయ సహాయం కూడా భూ భారతి చట్టం కల్పించిందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం పహాణి రాసి పెట్టాలని అన్నారు. ధరణి పాస్ పుస్తకాలు ఉంటే, నూతన చట్టం ప్రకారం కొత్త పాస్ పుస్తకం తెచ్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో ఎర్రయ్య, మండల వ్యవసాయ అధికారిణి రాధ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండిస్తూ సత్తుపల్లి లో కొవ్వొత్తుల ర్యాలీ

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిలో నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్ రావు మరణించారు. ఉగ్రదాడి ని ఖండిస్తూ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా దంపతుల ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ రింగ్ సెంటర్ నుంచి ఓల్డ్ బస్టాండ్ సెంటర్ వరకు కొవ్వొత్తు ల ర్యాలీ నిర్వహించారు.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో హిందు పర్యటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడి చేసి 20 మందిని పొట్టన పెట్టుకోవడంతో అమరులకు మద్దతుగా రెండు నిమిషాలు మౌనం పాటించి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమాయి మాట్లాడుతూ.. కాశ్మీర్ లోయలో పకృతి అందాలను వీక్షించేందుకు వెళ్లిన పర్యాటకులను కాల్చి చంపడం పట్ల సభ్య సమాజం ఖండించాల్సిన అవసరం ఉందని అలాంటి ఘోరాలు జరగకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ప్రత్యేక చర్యలు తీసుకొని పాకిస్తాన్ దేశంకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరూ హాజరై నిరసన వ్యక్తం చేశారు. మరియు వాసవి క్లబ్ అసోసియేషన్, క్రైస్తవులు ఎన్. సి. సి. అసోసియేషన్, సత్తుపల్లి మండలంలో ఉన్న కాలేజీలు, స్కూల్స్, ప్రిన్సిపాల్ లు ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకుల చల్లగుళ్ళ నరసింహారావు, కమల పాషా, చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు మట్ట చెన్నారావు, ముస్లిం మత పెద్దలు, క్రిస్టియన్స్ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




## నేడు పెద్దమందడిలో పాడి పరిశ్రమపై రైతులకు అవగాహన సదస్సు

**గట్టు ధనుంజయ్**
**మోజర్ల అముల్ పాలు ప్రొప్రైటర్**
**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**



పెద్దమందడి మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర నేడు మోజర్ల అముల్ పాలు ప్రొప్రైటర్ గట్టు ధనుంజయ్ ఆధ్వర్యంలో రైతులకు, పాల ఉత్పత్తిదారులకు,పశు పోషణ పై రైతులకు డీసీసీబీ, ఎస్బిఐ, టీజీబీ,యూనియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ల సహకారంతో నేడు పెద్దమందడి రైతు వేదిక దగ్గర ఉదయం 10 గంటలకు సాబార్ డైరీ పాల ఉత్పత్తుల పై రైతులకు అవగాహన నిర్వహించడం జరుగుతుంది.ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా కె.వి.ఎన్ రెడ్డి వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు రానున్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి పరుచుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న యంత్రోపకరణాల లబ్ధిని గురించి, వాటి లాభాల ద్వారా లబ్ధి పొందేందుకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగును.కావున వివిధ గ్రామాల పశు పోషణ రైతులు మరియు డైరీ ఫామ్ ఏజెంట్ల వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ప్రొఫెటర్ గట్టు ధనుంజయ్ ఓ ప్రకటనలో తెలిపారు.

## పర్యావరణంపై ఆ కుటుంబానికి ప్రత్యేక శ్రద్ధ..

**తాత అడుగుజాడల్లో మనవరాలు.....**
**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

పద్మశ్రీ వనజీవి రామయ్య దశదినకర్మ సందర్భంగా మూడువేల మొక్కలు, జ్యూట్ బ్యాగులు అందించిన బొడ్డుపల్లి రమేష్ గౌతమి దంపతులు మూడువేల పండ్ల మొక్కలతోపాటు జూడ్ బ్యాగులను పద్మశ్రీ మన జీవి రామయ్య మనవరాలు బొడ్డుపల్లి గౌతమి రమేష్ అందించారు. ఇటీవల పద్మశ్రీ వనజీవి రామయ్య గుండెపోటుతో మృతి చెందగా ఆయన దశాదినకర్మను గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మనవరాలు బొడ్డుపల్లి గౌతమి రమేష్ తాత పర్యావరణహితంపై చూపిన శ్రద్ధను కొనసాగింపుగా మూడువేల జ్యూట్ బ్యాగులను, పండ్ల పూల మొక్కలను అక్కడికి వచ్చిన వారికి అందించారు. దశాదినకర్మకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ మొక్కలను తీసుకొని సంతోషం వ్యక్తం చేశారు. పర్యావరణంపై ఆ కుటుంబానికి ఉన్న శ్రద్ధను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయ ప్రముఖులు అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.



## బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- గుర్రపు ప్రవీణ్,సోషల్ మీడియా నియోజకవర్గ ఇంచార్జ్

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**



భారత రాష్ట్ర సమితి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న హన్మకొండ ఎల్కతుర్తిలో జరుగనున్న రజతోత్సవ సభకు నియోజకవర్గం నుండి వేల సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలనీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ గుర్రపు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “తెలంగాణ ఉద్యమానికి మూలస్తంభంగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ, 24 ఏళ్లు పూర్తి చేసుకొని 25వ ఏట అడుగుపెడుతోంది. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి కార్యకర్త,నాయకుడి త్యాగఫలితమే ఈ ఘనత. ఇది మనందరికీ గర్వించదగిన సందర్భం. ఈ వేళ, ప్రతి ఒక్కరూ రజతోత్సవ సభను విజయవంతం చేయడమే నిజమైన కృతజ్ఞతగా నిలుస్తుంది” అన్నారు. పార్టీ నిర్మాణం నుండి రాష్ట్ర సాధన వరకు, ఉద్యమ లక్ష్యాల అమలులో బీఆర్ఎస్ పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. “తెలంగాణను సాధించిన పార్టీగా మాత్రమే కాకుండా, ప్రజల ఆకాంక్షల రూపకర్తగా, అభివృద్ధి మరియు సంక్షేమానికి మార్గదర్శిగా బీఆర్ఎస్ కొనసాగుతోంది. రైతు బంధు, ధనార్జన కల్పించే నూతన విధానాలు, వృద్ధి చెందుతున్న బలమైన సామాజిక వేదికలు ఇవే భవిష్యత్ కు పునాధులు అని వివరించారు.

భవిష్యత్తు పూర్తిగా బీఆర్ఎస్ దేనని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రానికి ఉన్న స్థిరత, భవిష్యత్తు తరం కోసం తీసుకున్న నిర్ణయాలే నూతన తెలంగాణ దిశగా నడిపించాయని ప్రవీణ్ అభిప్రాయపడ్డారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు——ప్రతి వర్గానికీ భరోసానిచ్చే నాయకత్వమే బీఆర్ఎస్ పార్టీ సొంతమని అన్నారు.రజతోత్సవ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది తరలిరావాలని, ప్రతి కార్యకర్త తాను ఓ నాయకుడని చాటుకునేలా ముందుండాలని పిలుపునిచ్చారు.

## రూ.12,800 కోట్లతో రెండు అణు రియాక్టర్ల నిర్మాణం

కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 700 మెగా వాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్‌ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) దక్కించుకుంది. ముంబయిలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్‌ను ఎంఇఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సిహెచ్ సుబ్బయ్య అందుకున్నారు. కైగా యూనిట్లు 5, 6 అణు రియాక్టర్లను ఎన్‌పిసిఐఎల్ కోసం ఎంఇఐఎల్ నిర్మించి ఇవ్వనుందని సుబ్బయ్య తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్స్ట్రక్షన్ (ఇపిసి) విధానంలో ఎంఇఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టన్నామన్నారు. ఇప్పటి వరకు ఎన్‌పిసిఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదేనన్నారు. తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీతత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనమన్నారు.

## బంగారం స్వచ్ఛతకు లెక్కలుంటాయి..

**ఆ నంబర్ల వెనుకున్న అర్థం ఇదే..!**

బంగారమంటే భారతీయులకు ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పండగలు, శుభకార్యాలు, పుట్టినరోజులు.. ఇలా ప్రతిసారి దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. మహిళలు బంగారు ఆభరణాలను ధరించడానికి బాగా ఇష్టపడతారు. తాము పొదుపు చేసుకున్న డబ్బులతో వాటినే ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే బంగారాన్నికొనడానికి అక్షయ తృతీయ రోజు మంచి ముహూర్తమని భావిస్తారు. ఈ రోజునే సమీపంలోని బంగారం దుకాణాల వద్దకు వెళ్లి తమ స్థోమతకు తగినట్టుగా కొనుగోలు జరుపుతారు. అయితే బంగారం కొన్నప్పుడు వాటి స్వచ్ఛత స్థాయిపై అవగాహన ఉండాలి. సాధారణంగా బంగారు ఆభరణాలను కొనుగోలు చేసినప్పుడు వాటి స్వచ్ఛతను 22, 24 కేరెట్ల రూపంలో చెబుతారు. బంగారు నాణేలు, కడ్డీలను కొనుగోలు చేసినప్పుడు వాటిపై 999, 995 అనే గుర్తులు ఉంటాయి. వాటికి గురించి చాలా మందికి పూర్తిస్తాయిలో అవగాహన ఉండదు. ఈ నంబర్లు బంగారం స్వచ్ఛతకు చిహ్నాలుగా చెప్పవచ్చు. 24 కేరెట్ల బంగారమంటే పూర్తిస్తాయి స్వచ్ఛమైనది అని అర్థం. దీనిలో ఎటువంటి లోహాలు కలవవు. 99.99 శాతం స్వచ్ఛత స్థాయి ఉంటుంది. కానీ ఇది ఆభరణాల తయారీకి పనికి రాదు. ఎందుకంటే బంగారంలో మరో లోహం కలిస్తేనే ఆభరణాలను తయారు చేయడానికి వీలుంటుంది. బంగారం కడ్డీలు, నాణేలపై 999 (99.9 శాతం), 995 (99.5 శాతం) నంబర్లు ఉంటే అది 24 కేరెట్ల స్వచ్ఛమైన బంగారం అని అర్థం. ఆ నంబర్లు స్వల్ప తేడాలతో ఒకే నాణ్యతను కలిగి ఉంటాయి. బంగారం స్వచ్ఛత పెరిగే కొద్దీ దాని ధర కూడా ఎక్కువవుతుంది. అక్షయ తృతీయ రోజు బంగారం కొనాలనుకునే వారికి నాణేలు, కడ్డీలు బాగుంటాయి. వాటితో పండగ రోజు మేలిమి బంగారం కొనుగోలు చేసిన అనుభూతి కలుగుతుంది. 24 కేరెట్ల (24 కె) బంగారం అత్యంత స్వచ్ఛమైనదని చెబుతున్నా.. ఆ నాణ్యతతో తయారు చేసిన ఆభరణాలు చాలా తక్కువగా ఉంటాయి. ఎక్కువగా 22 కె, 18 కెతో తయారు చేసిన వస్తువులే దుకాణాల్లో లభిస్తాయి. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే బంగారంలో ఇతర లోహాలు కలిస్తేనే ఆభరణాలు గట్టిగా ఉంటాయి. చక్కని డిజైన్ తో రూపొందించడానికి వీలు కలుగుతుంది. కాబట్టి చాలా మంది వ్యాపారులు ఆ నాణ్యతతోనే ఆభరణాలను తయారు చేస్తారు. అక్షయ తృతీయ రోజు కొనుగోలు చేయడానికి 24 కేరెట్ల బంగారం దొరకలేదని నిరాశ చెందనవసరం లేదు. దుకాణాల్లో 24 కేరెట్ల పెండెంట్లు, నాణేలు, చిన్న పూజా వస్తువులు లభిస్తాయి. ఇప్పుడిప్పుడే మన దేశంలో 23 కేరెట్ల ఆభరణాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. భారత ప్రభుత్వం 2021 నుంచి ఆరు స్వచ్ఛత స్థాయిలలో బంగారు వస్తువులకు హాల్ మార్కింగ్ ను తప్పనిసరి చేసింది.




# ఆంగ్లం – భావ వ్యక్తీకరణకు ప్రపంచ వేదిక

ప్రపంచ పరస్పరం అర్థం చేసుకోవడానికి భాష ఒక బలమైన వారధి. భాష అంటే మానవాళి భావాలను ఒకరితో ఒకరు తమ ఆలోచనలను, భావాలను, సమాచారాన్ని పంచుకోవడానికి ఉపయోగించే ఒక వ్యవస్థ. భాష ద్వారానే మనుషులు తమ సంస్కృతిని, జ్ఞానాన్ని తరతరాలకు బదిలీ చేస్తారు. ఒకనాటి బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. భాష కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనమే కాదు ! అంతకు మించి ఒక గొప్ప సాంస్కృతిక సంపద అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ఆంగ్ల సాహిత్య శిఖరం, నాటక చక్రవర్తి విలియం షేక్స్పియర్ పుట్టిన రోజుతోపాటు మరణించిన రోజు కూడా కావడంతో ఈ రోజును ఆంగ్ల భాషా దినోత్సవంగా జరుపుకోవడం విశేషం. 1564 ఏప్రిల్ 23న జన్మించిన ఆయన విధి విచిత్రంగా సరిగ్గా 52 ఏళ్ల తర్వాత 1616 ఏప్రిల్ 23న కన్నుమూశారు. ఆంగ్ల సాహిత్యంలో తిరుగులేని రచయితగా షేక్స్పియర్ ఆధునిక ఆంగ్లభాషపై చెరగని ముద్రవేశారు. భాషతో ఆయన చేసిన సృజనాత్మక ప్రయోగాలు అద్భుతం. వందలాది కొత్తపదాలు, పదబంధాలను ఆంగ్ల భాషకు అందించారు. నేడు మనం విరివిగావాడే 'గాసిప్', 'ఫ్యాషన్', 'లోన్లీ' వంటి పదాలు మొదట షేక్స్పియర్ కలం నుండి జాలువారినవే. అంతేకాదు, 'బ్రేక్ ది ఐస్', 'ఫైంట్‌హార్టెడ్', 'లవ్ ఈజ్ బ్లైండ్' వంటి ఎన్నో అందమైన పదబంధాలను ఆయనే పరిచయం చేశారు. ఆయన రచించిన 39 నాటకాలు, 154 సొనెట్‌లు, మూడు సుదీర్ఘ కథన పద్యాలు ఆంగ్ల సాహిత్యానికి దివ్యమైన కానుకలు. నిపుణులు భావించేదాని ప్రకారం ఆయన రచనల్లోని విషాదఛాయలు ఆయన వ్యక్తిగత జీవితంలోని దురదృష్టకర సంఘటనలకు అద్దంపడతాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే షేక్స్పియర్ సుమారు 1700 కొత్త పదాలను ఆంగ్ల భాషకు బహూకరించారు. 2025 సంవత్సరానికి ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం ఇతివృత్తం 'ఇంగ్లీష్: నిజంగా ప్రపంచ భాష'. ఈ అంశం ప్రపంచ భావ వ్యక్తీకరణ, సహకారంకోసం ఆంగ్లం పోషిస్తున్న కీలక పాత్రను నొక్కి చెబుతుంది. అంతేకాకుండా, ఆంగ్లం విభిన్న సంస్కృతులను ఎలా కలుపుతుంది ? భావ వ్యక్తీకరణ అడ్డంకులను ఎలా తగ్గిస్తుంది? అనే విషయాలపై చర్చలు జరుగుతాయి.అంతర్జాతీయ దౌత్యం, సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం, విద్య వంటి అనేక రంగాలలో ఆంగ్లం ప్రాముఖ్యతను ఈ రోజున గుర్తు చేసుకుంటారు. నేటి ప్రపంచంలో బహుభాషావాదం ప్రాధాన్యతను, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రత్యేక స్థానాన్ని చాటి చెప్పడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.యునెస్కో 2010లో మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని




నిర్వహించింది. ప్రపంచంలోని 75 కంటే ఎక్కువ దేశాలు ఆంగ్లాన్ని తమ అధికారిక భాషగా గుర్తించాయి. భాషను అన్వేషించడం ద్వారా బహుభాషావాదం సాంస్కృతిక వైవిధ్యాన్ని ఎలా పరిరక్షిస్తుందో తెలియజేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ఆంగ్ల భాషా దినోత్సవం చరిత్ర, సంస్కృతి, భాషతో ముడిపడి ఉన్న విజయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్యోద్దేశం.ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే రెండవ భాషగా ఆంగ్లం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ప్రపంచీకరణ యుగంలో ఆంగ్లం నేర్చుకోవడం ఒక అనివార్య అవసరంగా మారింది. వివిధ దేశాల ప్రజలు ఒకరితో ఒకరు సులభంగా సంభాషించడానికి ఇది ఒక విశ్వ వేదికగా ఉపయోగపడుతుంది.

బహుళజాతి కంపెనీలు ఆంగ్లంపై పట్టు ఉన్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రపంచంలోని అనేక ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలోనే విద్యాబోధన కొనసాగుతోంది. సైన్స్, ఏవియేషన్, కంప్యూటర్లు, దౌత్యం, పర్యాటకం వంటి అనేక కీలక రంగాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు అధికంగా ఆంగ్లంలోనే అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు ఆంగ్లమే ప్రాథమిక ఆధారం. నేటి డిజిటల్ యుగంలో ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్లలో నిక్షిప్తం చేయబడిన సమాచారంలో 80 శాతానికి పైగా ఆంగ్లంలోనే ఉండటం విశేషం. దాదాపు అన్ని ముఖ్యమైన వెబ్‌సైట్‌లు ఆంగ్లంలోనే రూపొందించబడ్డాయి. అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలకు ఆంగ్లం ఒక కీలకమైన సాధనం. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య సంబంధాలు విజయవంతంగా కొనసాగించడానికి ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం. ఆంగ్లం నేర్చుకోవడం కేవలం ఉద్యోగ అవకాశాలనే కాకుండా ఇతర సంస్కృతులను అర్థం చేసుకోవడానికి, విభిన్న ప్రాంతాల ప్రజలతో నిజమైన అనుబంధం ఏర్పరచుకోవడానికి, వారి జీవనశైలిని తెలుసుకోవడానికి కూడా సహాయపడుతుంది.ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 కోట్ల మంది ప్రజలు ఈ భాషను మాట్లాడుతున్నారు. ఈ సంఖ్య 2050 నాటికి 200 కోట్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మన భారతదేశంలో దాదాపు 14 కోట్ల మంది అంటే జనాభాలో 10 శాతం మంది ఆంగ్లం మాట్లాడేవారు ఉన్నారు. ఆంగ్లం మాట్లాడే వారిని 'ఆంగ్లోఫోన్స్' అని పిలుస్తారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో రెండవ స్థానంలో ఉన్న మాండరిన్ చైనీస్ కంటే ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య 28 శాతం అధికంగా ఉండటం గమనార్హం. సుమారు 1500 సంవత్సరాల క్రితం కేవలం మూడు తెగల ప్రజలు మాత్రమే ఈ భాషను మాట్లాడేవారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 95 కోట్ల మంది ఆంగ్లాన్ని వారి మొదటి భాషగా, మరో 60 కోట్ల మంది రెండవ భాషగా మాట్లాడుతున్నారు. ఆంగ్లం ప్రపంచంలో అత్యంత విస్తృతంగా మాట్లాడబడుతున్నందున దీనిని తరచుగా 'ప్రపంచ భాష' గా అభివర్ణిస్తారు. ఇది ఆధునిక యుగం భాష. అనేక దేశాలలో అధికారిక భాష కానప్పటికీ ప్రస్తుతం ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా బోధించే ఒక విదేశీ భాషగా ప్రాచుర్యం పొందింది. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో సహా అనేక ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థల అధికారిక భాషల్లో ఆంగ్లం ఒకటి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లో పనిచేసే వ్యోమగాములకు రష్యన్‌తో పాటు ఇది ఒక సహ అధికారిక భాష కావడం దీని ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆంగ్లం ఇతర భాషల నుండి అనేక పదాలను స్వీకరించింది.



దాడులు ఆపేందుకు ప్రయత్నించి..

## ప్రాణాలు కోల్పోయిన గుర్రం స్వారీ యువకుడు

**శ్రీనగర్:** ఉగ్రవాదులు తెగబడినపుడు ఆ ప్రాంతంలో ఉన్న వారెవరైనా తన, మన బేధం లేకుండా ఆ దాడులు ఆపేందుకు ప్రయత్నించారనడానికి ఈ ఘటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. పర్యాటకులపై ముష్కరులు తూటాలు ఎక్కుపెట్టి కాల్పులు జరపటానికి సిద్ధమైనపుడు.. పాపం.. చంపొద్దు అంటూ ఓ గుర్రం స్వారీ యువకుడు ఆపడానికి ప్రయత్నించాడు. ఆ దుర్మార్గులు అతన్నీ వదల్లేదు. మరో చోట 11 మంది కుటుంబ సభ్యులను ఓ కాశ్మీరి వ్యాపారి సురక్షితంగా కాపాడారు. స్థానిక ఆటోడ్రైవర్లు, జనం పర్యాటకులకు అండగా నిలవటానికి ముందుకు రావటం గమనిరచదగ్గ విషయం.జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిని ఆపేందుకు ఓ గుర్రం స్వారీ యువకుడు సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా ప్రయత్నించాడని సిఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో అతడు కూడా మరణించాడని చెప్పారు. బుధవారం నిర్వహించిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అంత్యక్రియల్లో ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో సిఎం మాట్లాడారు. 'ఏం చెప్పను? మా అతిథులు సెలవులకు వచ్చారు. దురదృష్టవశాత్తు వారిని శవపేటికల్లో పంపాల్సిన దుస్థితి. ఈ యువకుడు (షా) జీవనోపాధి కోసం చాలా కష్టపడ్డాడు. పని కోసం ఇంటి నుంచి వెళ్లాడు. దురదృష్టవశాత్తు అతడి మృతదేహాన్ని కూడా శవపేటికలో తిరిగి ఇచ్చాం' అని బాధపడుతూ తెలిపారు.

## ఫెడ్ చీఫ్‌ను తొలగించే ఉద్దేశం లేదు

**వాషింగ్టన్:** అమెరికా ఫెడరల్ చీఫ్ జెరోమ్ పావెల్‌ను తొలగించడం లేదని అధ్యక్షులు ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగనుందని ఇటీవల జెరోమ్ పావెల్ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌పై ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయనను పదవి నుండి తొలగిస్తారంటూ ప్రపంచ మార్కెట్లలో ఆందోళనను రేకెత్తించాయి. ఈ అంశంపై మంగళవారం ట్రంప్ స్పందించారు. జెరోమ్‌ను తొలగించే ఉద్దేశ్యం తనకు లేదని అన్నారు. వడ్డీరేట్లను తగ్గించడంపై పావెల్ మెరుగ్గా స్పందించాల్సి వుందని తాను కోరుకుంటున్నానని అన్నారు. వడ్డీ రేట్లను తగ్గించడానికి ఇది సరైన సమయమని అన్నారు. చైనాపై విధించిన ప్రతీకార సుంకాలపై ట్రంప్ వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ''145 శాతం సుంకాలు చాలా అధిక స్థాయి అని, ఇది గణనీయంగా తగ్గుతుంది'' అని ట్రంప్ మంగళవారం అంగీకరించారు. చైనా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని, కానీ సున్నా మాత్రం కావని అన్నారు. చైనా తమతో ఏదైనా ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సిందేనని అన్నారు.

తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు

## బిజెపి-ఎఐఎడిఎంకె కూటమి చైతన్యమేనా? కంచికా?

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు విడిపోయిన ఎఐఎడిఎంకె, బిజెపి పొత్తు ఒకటిన్నర సంవత్సరాల తర్వాత, 2026 ప్రారంభంలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి ఏర్పర్చుకొనేందుకు రెండు పార్టీలు ముందడుగు వేస్తున్నాయి. 2021లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుండి తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వస్తున్న ఎఐఎడిఎంకె డిఎంకె నేతృత్వంలోని కూటమిని అధికారం నుండి తొలగించే ప్రయత్నాలలో బిజెపితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నది. మరోవంక, దక్షిణాదిన వ్యాప్తి చెందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక పోవడంతో తమిళనాడులో బలం పెంచుకునేందుకు బిజెపి సైతం ఆత్రుతతో వ్యవహరిస్తున్నది.అయితే ఆ రెండు పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో చేతులు కలుపుతున్నా ఆచరణలో పరస్పరం అవిశ్వాసంతో వ్యవహరిస్తున్నాయి. ఆయా పార్టీలలో సైతం పొత్తుకు సానుకూలమైన సంకేతాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానం వంటి అంశాలను దూకుడుగా లేవనెత్తడంతో పాటు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సంఘర్షణకు దిగడం ద్వారా 'తమిళ్ ప్రైడ్' ఆయుధంగా ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఓ విధంగా రాష్ట్రరాజకీయాలపై ఆధిపత్యంతో వ్యవహరిస్తున్న డిఎంకెను ఎదుర్కొనేందుకు అవసరమైన సైద్ధాంతిక, రాజకీయ పటుత్వం ఎఐఎడిఎంకె బిజెపి కూటమిలో కనిపించడం లేదు. బిజెపితో తిరిగి పొత్తు పెట్టుకోవడంపై ఎఐఎడిఎంకెలో అసంతృప్తి గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చివరకు ఈ పొత్తులో కీలకంగా కనిపించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఒత్తిడులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నది. ఆయన మద్దతుతోనే బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అన్నాడిఎంకెను మాత్రమే కాకుండా పార్టీలో కీలక నేతలను సైతం దూరం చేసుకున్నారని తెలుస్తోంది. పొత్తు ప్రకటన కోసం చెన్నైకి రావడానికి రెండు రోజుల ముందు కొంతమంది బిజెపి కార్యకర్తలు ఢల్లీ వెళ్లి ఆయనను కలిసి అన్నామలైను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని కోరితే ఆయన తీవ్రమైన ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు.నాయకత్వం విషయం తమకు వదిలివేసి బూత్ స్థాయిలో పార్టీ పని చూసుకోండి అంటూ మందలించి పంపించారు.నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఢల్లీకి రావద్దని హెచ్చరించారు. అయితే, ఎఐఎడిఎంకెతో పొత్తు కోసం ఏప్రిల్ 10న అమిత్ షా చెన్నైకి వచ్చినప్పుడు, దాని నాయకుడు ఇ కె పళనిస్వామి విమానాశ్రయంలో తనకు స్వాగతం చెప్పేందుకు రాకపోవడంతో ఖంగుతిన్నారు. ఆ రోజు సాయంత్రం అనుకున్న ఎన్‌డిఎ మీడియా సమావేశం బిజెపి సమావేశంగా మారింది. దానితో వెంటనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి వద్దకు వెళ్లి సమాలోచనలు జరిపారు. ఆ వెంటనే అన్నామలై సైతం వెళ్లి ఆయనను కలిశారు.



అన్నాడిఎంకె బిజెపి పొత్తులో మొదటి నుండి గురుమూర్తి కీలక భూమిక నిర్వహిస్తున్నారు. ఆ తర్వాతనే రాష్ట్ర అధ్యక్షుడిని మార్చడం, మరుసటి రోజు మాజీ అన్నాడిఎంకె నేత నైనార్ నాగేంద్రన్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించిన తర్వాతనే పొత్తు ఖరారు చేస్తూ అమిత్ షా ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి పళనిస్వామి రావడం జరిగింది. అయితే ఆ తర్వాత తమ పొత్తు సీట్ల సర్దుబాటు వరకే అని, ఎన్నికల అనంతరం తాము ఏర్పాటు చేయబోయే మంత్రివర్గంలో బిజెపి ఉండబోదని పళనిస్వామి ప్రకటించడం గమనార్హం. అన్నాడిఎంకెతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటీవలి సంవత్సరాలలో బిజెపి వైపు ఉన్న మాజీ ఎఐఎడిఎంకె నాయకులు, మాజీ సిఎం ఓ పన్నీర్ సెల్వం, తన సొంత పార్టీ ఎఎంఎంకెకు నాయకత్వం వహిస్తున్న టిటివి దినకరన్ వంటి వారు ఈ కూటమికి దూరంగానే కనిపిస్తున్నారు. బిజెపి ఎఐఎడిఎంకె కూటమి అటువంటి పార్టీలను ఎన్‌డిఎ కూటమిలో ఎలా తీసుకురాగలదో చూడాలి. చెన్నైలో తమ కూటమిని ప్రకటిస్తూ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిజెపి ఎఐఎడిఎంకె అంతర్గత విషయాలలో జోక్యం చేసుకోదు లేదా తొలగించిన నాయకులను తిరిగి చేర్చుకోవాలని వారిని అడగదు. ఎటువంటి జోక్యం ఉండదు అని స్పష్టమైన హామీ ఇవ్వాల్సి రావడం గమనార్హం. 2016 ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేసిన బిజెపి ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. దాని 188 మంది అభ్యర్థులలో ఎనిమిది మంది తప్ప మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోయారు. 2.8% వద్ద, బిజెపి ఓట్ల వాటా 2011 ఎన్నికలలో పొందిన 2.2% నుండి స్వల్పంగా మాత్రమే పెరిగింది. అంతకు ముందు లోక్ సభ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన ఎఐఎడిఎంకె బిజెపి పొత్తు మొదటిసారిగా 2021లో అసెంబ్లీ ఎన్నికలకు విస్తరించింది. దానితో మొదటిసారిగా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకోగలిగింది. ఆ పార్టీ రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవడం ఇది మూడోసారి మాత్రమే. ఎఐఎడిఎంకె సీట్ల సంఖ్య 66కు పడిపోయింది. చాలా సీట్లలో పోటీ చేసిన ఎఐఎడిఎంకె తన ఓట్ల వాటాను 33.3%కి తగ్గించుకుంది. అయితే, కేవలం 20 సీట్లలో పోటీ చేసినప్పటికీ బిజెపి ఓట్ల వాటా స్వల్పంగా 2.6%కి పడిపోయింది. సెప్టెంబర్ 2023 లో, ఎఐఎడిఎంకె నాయకత్వంపై అన్నామలై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సంబంధాలను తెంచుకొనే వరకు వెళ్లడంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేశాయి. డిఎంకె నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో వారిద్దరూ ప్రభావం చూపలేకపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అసెంబ్లీ స్థాయిలో పరిశీలిస్తే, ఒక్క సీటు కూడా గెలవలేకపోయినప్పటికీ, బిజెపి 59 సెగ్మెంట్లలో రెండవ స్థానంలో, 64 సెగ్మెంట్లలో మూడవ స్థానంలో నిలిచింది. వీటిలో, బిజెపి 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో 20 శాతం కంటే ఎక్కువ ఓట్లను, 20 సెగ్మెంట్లలో 30 శాతం కంటే ఎక్కువ ఓట్లను సాధించింది. ఆ బలంతోనే వచ్చే ఎన్నికలలో తన ఉనికిని మరింతగా పెంచుకునేందుకు బిజెపి ఉత్సాహ పడుతున్నది. తమిళ పార్టీలు తమ సైద్ధాంతిక పటుత్వం కోల్పోయాయని, దానితో ఇప్పుడు జాతీయ రాజకీయ పార్టీలకు తమిళనాడులో అనువైన వాతావరణం ఏర్పడుతున్నదని తుగ్లక్ సంపాదకుడు ఎస్ గురుమూర్తి భావిస్తున్నారు. అందుకనే అన్నాడిఎంకె బిజెపి కూటమిని తమిళ ప్రజలు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, జయలలిత మరణం తర్వాత అన్నాడిఎంకె శ్రేణులు అందరినీ ఉమ్మడిగా తీసుకెళ్లగల నాయకత్వం ఆ పార్టీలో కనిపించడం లేదు. మరోవంక బిజెపిని 'తమిళ్ వ్యతిరేక' పార్టీగా ప్రజలు చుస్తున్నారని, అందుకనే ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని దెబ్బ తిన్నామని గతంలో ఆ పార్టీ నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యవహారం సైతం బిజెపిని 'తమిళ వ్యతిరేక' పార్టీగా చూపే ప్రయత్నాలకు ఊతం కలిగిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ రెండు సార్లు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పడవేయడం ద్వారా సుప్రీం కోర్టు ద్వారా చివాట్లు తిన్న తర్వాత కూడా ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఆ బిల్లుల్లో ఒక బిల్లు విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో గవర్నర్ పాత్ర నామమాత్రమే అని స్పష్టం చేస్తుంది. ఏప్రిల్ 16న అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశం నిర్వహించారు. అయితే విశ్వవిద్యాలయాలపై ముఖ్యమంత్రి కన్నా తానే అధికుడని సంకేతం ఇచ్చేందుకు ఏప్రిల్ 25 నుండి మూడు రోజుల పాటు ఊటీలో అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశం ఏర్పాటుచేసి, దానికి స్వయంగా ఉపరాష్ట్రపతి జగదేవ్ ధంకర్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఈ విధంగా సమావేశం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు తీర్పు ధిక్కారమే అంటూ కేవలం డిఎంకే కూటమిలోని పక్షాలే కాకుండా అన్నాడిఎంకె, బిజెపి కూటమిలోని పక్షాలు సైతం ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నాయి. చివరకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు సైతం గవర్నర్ చర్యను సమర్థింపలేకపోతున్నారు. గవర్నర్ చర్యలు రాజకీయంగా డిఎంకె కూటమికి బలం చేకూరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకనే తక్షణమే గవర్నర్‌ను మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవంక, అన్నామలైని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకురావడం ద్వారా తమిళ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా కొనసాగించాలంటూ అమిత్ షా చేస్తున్న ప్రయత్నాలు సైతం ఈ కూటమి సయోధ్యకు ప్రశ్నార్ధకం చేస్తున్నాయి. పరస్పర వైరుధ్యాల మధ్య ఈ కూటమి వచ్చే ఏడాది ఎటువంటి ఫలితాలు సాధించగలదో చూడాల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# స్తంభించిన కాశ్మీరం

## 35ఏళ్ళలో తొలిసారి స్వచ్ఛందంగా

**శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా బుధవారం బంద్ పాటించారు. దీంతో కాశ్మీర్ లోయలో జన జీవనం స్తంభించింది. దుకాణాలు, వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. కాగా కాశ్మీర్ లోయలో ఉగ్ర వాద దాడులకు వ్యతిరేకంగా ప్రజా జీవనం స్తంభించిపోవడం గత 35ఏళ్ళలో ఇదే మొదటిసారి. ఉగ్రవాదులు మంగళవారం జరిపిన దాడిలో 28 మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. శ్రీనగర్‌లోనూ, లోయలోని ఇతర ప్రాంతాలలోనూ ప్రభుత్వ వాహనాలు నామమాత్రంగానే కన్పించాయి. ప్రైవేటు వాహనాలు మాత్రం మామూలుగానే తిరిగాయి. ప్రైవేటు పాఠశాలలను మూసివేయగా ప్రభుత్వ పాఠశాలలు తెరిచే ఉన్నాయి. కాశ్మీర్ వాణిజ్య పరిశ్రమల మండలి (కేసీసీఐ), కాశ్మీర్ వ్యాపారులుఉత్పత్తిదారుల సమాఖ్య (కేటీఎంఎఫ్), మత సంస్థ ముత్తాహిదా మజ్లిస్ ఉలేమా (ఎంఎంయూ), జమ్మూకాశ్మీర్‌కు చెందిన గ్రాండ్ ముఫ్తి నసీరుల్ ఇస్లాం సంయుక్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. 'ఇలాంటి హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావు. మన సమాజంలో వీటికి స్థానం లేదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ సంఘటితం కావాలి. శాంతియుత, సామ రస్యపూర్వకమైన సమాజం కోసం కృషి చేయాలి.'' అని గ్రాండ్ ముఫ్తి ఒక ప్రకటనలో కోరారు. జమ్మూ ప్రాంతంలో కూడా బంద్‌కు పూర్తి మద్దతు లభించింది. జమ్మూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, జమ్మూ బార్ అసోసియేషన్ పూర్తి బంద్‌కు పిలుపునిచ్చాయి. జమ్మూ నగరంలోనూ, ఇతర ప్రధాన ప్రాంతాలలోనూ బంద్ దృశ్యాలు కన్పించాయి. బంద్‌కు రాజకీయ పార్టీలు, నేతలు మద్దతు తెలిపారు. బాధితులకు సంఘీభావం ప్రకటించారు. లోయ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా కీలక పర్యాటక ప్రదేశాల వద్ద అదనపు దళాలను మోహరించారు. నిత్యావసరాలను విక్రయించే దుకాణాలను మాత్రమే అనుమతించారు. లోయలోని అన్ని జిల్లా కేంద్రాలలోనూ బంద్ ప్రభావం బాగా కన్పించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలు, రాజకీయ పార్టీలు, మత సంస్థలు, పౌర సమాజ గ్రూపులు సంఘటితమై ఈ విధంగా బలమైన సందేశాన్ని పంపడం ఇటీవలి కాలంలో చాలా అరుదైన విషయం.

# జమ్మూ కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్



**జమ్మూ :** జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఒక ఆర్మీ జవాను మృతి చెందినట్లు గురువారం అధికారులు తెలిపారు. ఉధంపూర్ జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ తరువాత ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదుల ఉనికిపై సమాచారం ఆధారంగా ప్రారంభించిన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో దూదుబసంత్‌గఢ్ ప్రాంతంలో కాల్పులు జరిగాయని వారు తెలిపారు. నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా ఉధంపూర్‌లోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఈరోజు జమ్మూ కాశ్మీర్ పోలీసులతో సంయుక్త ఆపరేషన్ ప్రారంభించామని వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్‌లో తెలిపింది. భద్రతా దళాలు, ఉగ్రవాదుల భీకర కాల్పులు జరిగాయని తెలిపారు. ఈ దాడిలో జవాన్‌కు తీవ్ర గాయపడ్డారు. ఉత్తమ వైద్య ప్రయత్నాలు ఉన్నప్పటికీ మరణించారని ఆర్మీ తెలిపింది. ఘటన స్థలం నుండి చివరి నివేదికలు వచ్చినప్పుడు ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వారు తెలిపారు.

# జమ్ముకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు



జమ్ముకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని, వారిలో అత్యధికంగా లష్కరే తొయ్యిబా ముఠా సభ్యులున్నారని భద్రతా సంస్థలు వెల్లడిరచాయి. భద్రతా దళాలు నిర్వహిస్తున్న రికార్డుల ఆదారంగా ఈ విషయం వెల్లడవుతోంది. వారిలో 18 మంది జైషేమహమ్మద్ , 25 మంది లష్కరే ముఠాలకు చెందిన వారని వాటిని బట్టి తెలుస్తోంది. ముగ్గురికి హిజ్బుల్ ముజాహిద్దీన్‌తో సంబంధం ఉందని, వారు కూడా పాకిస్థాన్‌కు చెందిన వారని, భద్రతా సంస్థలకు చెందిన అధికారి ఒకరు వెల్లడిరచారు. ఇక 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోల్చుకుంటే ఆ సంఖ్య తక్కువగా ఉంది. ఈ విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తొయిబా అనుబంధ విభాగం ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి తెగబడినట్టు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాల్పుల తరువాత సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది. మరోవైపు ఉగ్రదాడి దృష్టా ఢల్లీలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉండగా, పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదుల ఊహా చిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు.

# గాజాలో డయాలసిస్ రోగుల అవస్థలు

**గాజా :** గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దిగ్బంధనం కారణంగా ఆహార పదార్థాలు, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు అందక ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికితోడు మందులు, ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అందక రోగులు వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. వారానికి నాలుగుసార్లు డయాలసిస్‌పై ఆధారపడి రోజులు వెళ్లదీసే రోగుల అవస్థలు చెప్పనక్కరలేదు. మార్చి ప్రారంభం నుండి ఇప్పటివరకు 11మంది రోగులు సకాలంలో వైద్యం అందక మరణించారు. కిడ్నీలు విఫలమై 417మంది మరణించారని అల్ షిఫా ఆస్పత్రిలో డయాలసిస్ విభాగ అధిపతి డాక్టర్ ఘుజీ చెప్పారు. మొత్తంగా యుద్ధం ప్రారంభమైన తర్వాత 1100మందికి పైగా రోగులు మృత్యువాత పడ్డారు. గాజావ్యాప్తంగా ఆస్పత్రులన్నీ దాడుల్లో ధ్వంసం కావడంతో డయాలసిస్ కోసం వారంలో రెండుసార్లు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. లేనిపక్షంలో శరీరమంతా ఉబ్బిపోయి, విష పూరితమయ్యే దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, ఒకోసారి అవి మరణానికి దారి తీస్తున్నాయని డాక్టర్ ఘుజీ చెప్పారు. నగరానికి పశ్చిమాన గల తాత్కాలిక శిబిరాల నుండి ఉత్తర ప్రాంతంలోని షిఫా అస్పత్రికి వెళ్లడమంటే వారికి అత్యంత ఇబ్బందికరంగా మారుతోంది. 54 ఏళ్ల మహ్మద్ అతియా దాదాపు 15ఏళ్ల నుండి కిడ్నీ వైఫల్యంతో బాధపడుతూ డయాలిసిస్‌పై జీవిస్తూ, వీల్ ఛైర్‌కే పరిమితమయ్యారు. రోగికి వారానికి కనీసం మూడుసార్లు డయాలసిస్ అవసరం, ప్రతీ సారి నాలుగు గంటలు చొప్పున ఈ ప్రక్రియ వుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు సార్లు మాత్రమే చేయడానికి సాధ్యమవుతోందని, అది కూడా రెండు నుండి మూడు గంటల్లోనే ముగించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా నెలకొన్న దుర్భర పరిస్థితుల్లో సరైన సరఫరాలు, సదుపాయాలు లోపించడంతో తన రక్తంలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత దిగ్బంధన చర్యలపై వ్యాఖ్యానించడానికి ఇజ్రాయిల్ మిలటరీ సంస్థ ఇన్‌చార్జి సిఓజిఎటి (కోఆర్డినేషన్ ఆఫ్ గవర్నమెంట్ యాక్టివిటీస్ ఇన్ ది టెరిటరీస్) నిరాకరించారు. గాజా లోపలకు ప్రవేశించడానికి అనుమతులు లేక టన్నుల కొద్దీ మందులు, ఇతర వైద్య పరికరాలు, సామాగ్రి గాజా సరిహద్దుల్లో పడివున్నాయి. యుద్ధంతో గాజాలో మొత్తంగా ఆరోగ్య వ్యవస్థ చిన్నాభిన్నమైంది.



## న్యూజెర్సీ నుండి 3,000 మంది

# నివాసితుల తరలింపు

**న్యూయార్క్ :** అమెరికాలోని న్యూజెర్సీలో కార్చిచ్చు వ్యాపించడంతో సుమారు 3,000మంది నివాసితులను ఖాళీ చేయించారు. కార్చిచ్చుతో వేలాది ఎకరాలు దగ్ధమయ్యాయని, వందలాది నిర్మాణాలకు ముప్పు కలిగిస్తోందని రాష్ట్ర అగ్నిమాపక దళం మంగళవారం తెలిపింది. రాత్రి 10.30 గంటలకు ఓషన్ కౌంటీలో కార్చిచ్చు ప్రారంభమైందని, పది శాతం అదుపులోకి వచ్చాయని న్యూ జెర్సీ ఫారెస్ట్ ఫైర్ సర్వీస్ సోషల్‌మీడియా ఖాతా ఎక్స్‌లో పేర్కొంది. 3,200 ఎకరాల్లో మంటలు చెలరేగాయని మొదట నివేదించింది. రెండు గంటల అనంతరం మంటలు 8,500 ఎకరాల (3,440 హెక్టార్లు)కు వ్యాపించాయని పేర్కొంది. అగ్నిమాపక యంత్రాలు, బుల్డోజర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు అనేక మంది అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బందిని మోహరించినట్లు అగ్నిమాపక సంస్థ తెలిపింది. కార్చిచ్చు చెలరేగడానికి గల కారణాలపై విచారణ చేపడుతున్నట్లు వెల్లడిరచింది. ఈ అంశంపై బుధవారం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా తూర్పు తీరంలో అతిపెద్ద రక్షిత ప్రాంతాలలో ఒకటైన పైన్ బారెన్స్‌లో మంటలు చెలరేగాయని స్థానిక మీడియా తెలిపింది. న్యూజెర్సీని కరువు ప్రాంతంగా రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ శాఖ మార్చిలో ప్రకటించింది. కార్చిచ్చుతో సుమారు 25,000 మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని జెర్సీ సెంట్రల్ పవర్ అండ్ లైట్ ఎక్స్‌లో పేర్కొంది. కార్చిచ్చు కారణంగా న్యూజెర్సీ రాష్ట్రం గుండా వెళ్లే గార్డెన్ స్టేట్ పార్క్‌వేలోని ఒక విభాగాన్ని కూడా మూసివేసినట్లు తెలిపారు



## తాత్కాలిక పారిశుధ్య కార్మికుల కోసం

# సంక్షేమ సహాయ కేంద్రాలు

**చెన్నై:** తాత్కాలిక పారిశుధ్య కార్మికుల కోసం సంక్షేమ సహాయ కేంద్రాలను చెన్నై మేయర్ ఆర్. ప్రియ బుధవారం ప్రారంభించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జిసిసి)లోని 15 జోనల్ కార్యాలయాలలో తమిళనాడు పారిశుధ్య కార్మికుల సంక్షేమ బోర్డు మద్దతుతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సహాయ కేంద్రాలు అన్ని వర్గాల పారిశుధ్య కార్మికులకు సహాయం చేస్తాయి. జిసిసితో పనిచేసేవారు, నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ వంటి సంస్థలు, సంస్థల నుండి అవుట్‌సోర్స్ చేయబడినవారికి కూడా ఈ కేంద్రాల ద్వారా సహాయం చేస్తారు. బోర్డులోని నమోదిత సభ్యులకు గుర్తింపు కార్డులు, సమాచార బుక్‌లెట్‌లను కూడా పంపిణీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. 17,659 తాత్కాలిక కార్మికులు, సాధారణ, క్రమరహిత మురుగునీటి సంబంధిత పనులలో నిమగ్నమైన 17,627 మంది కార్మికులతో సహా మొత్తం 35,286 పారిశుధ్య కార్మికులు సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డులను అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 12,273 మంది కార్మికులు తమ కార్డులను అందుకున్నారని పేర్కొన్నారు. ప్రమాద బీమా, మరణం, అంత్యక్రియలు, పెన్షన్లు, వివాహం మరియు ప్రసూతి ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలకు ఈ సహాయ కేంద్రాలు సహాయం అందిస్తాయి. తమిళనాడు అర్బన్ శానిటేషన్ సపోర్ట్ ప్రోగ్రామ్ ద్వారా జిసిసిఉద్యోగిత పారిశుధ్య కార్మికులకు నైపుణ్య శిక్షణ, భద్రతా సామగ్రి మరియు ఇతర సహాయాన్ని అందిస్తున్నట్లు వితెలిపారు.

## ఎఫ్ఐఐటి, జెఈఈ కోచింగ్ యజమానులపై

# ఈడీ దాడులు

ఢిల్లీలోని ఎఫ్ఐఐటి జెఈఈ కోచింగ్ సెంటర్ల ప్రమోటర్లు/యజమానులకు సంబంధించిన కేసులో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. ఢల్లీ, నోయిడా మరియు గురుగ్రామ్‌లలోని ఎనిమిది ప్రదేశాలలో ఈ సోదాలు జరిగాయి. జనవరి 2025లో దేశవ్యాప్తంగా అనేక ఎఫ్ఐఐటి జెఈఈ కేంద్రాలు ఎటువంటి నోటీసు లేకుండా అకస్మాత్తుగా మూసివేయబడ్డాయి. తల్లిదండ్రులు ఏడాది పొడవునా ముందస్తు చెల్లింపులు చేశారని, తమకు ముందస్తు సమాచారం లేకుండా కోచింగ్ సెంటర్లను మూసివేసారని మండిపడ్డారు. దీనివల్ల 12,000 మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిరదని ఆరోపించారు. కోచింగ్ సెంటర్ల ప్రమోటర్లలో ఒకరైన డికే.గోయెల్‌తో సహా కీలకమైన కుట్రదారుల నివాస స్థలాలతో పాటు కొన్ని కార్యాలయాలపై ఈడీ సోదాలు జరిగినట్లు ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. కోచింగ్ సెంటర్ల నుండి తీసుకున్న నిధులను వ్యక్తిగత లాభాలు/ఇతర సంస్థల వైపు మళ్లించడం వంటి ఆరోపణలు వెలువడుతున్నాయి.

## లోయలో పడిన వ్యాన్..

# 16 మంది మృతి


దక్షిణ పాకిస్థానలో వేగంగా వెళుతున్న వ్యాన్ లోయలో పడిపోవడంతో మహిళలు, పిల్లలు సహా కనీసం 16 మంది మృతి చెందగా, 30 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. సింధ్ ప్రాంతంలోని జంషోరో జిల్లాలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. అందిన వివరాల ప్రకారం, కొండ ప్రాంతంలో వ్యాన్ డ్రైవర్ అతి వేగం కారణంగా వాహనం అదుపు తప్పి గంటలో పడిపోయింది. 16 మంది అక్కడికక్కడే మృతి చెందగా, 30 మంది గాయపడ్డారని సమాచారం. పంజాబ్ ప్రాంతంలోని లాపారి నుండి సింధ్ ప్రాంతంలోని బాడిన్‌కు కోల్హి తెగకు చెందిన వ్యక్తులను వ్యాన్ తీసుకెళుతుండగా దర్ఘటనకు గురయింది. పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలికి చేరకుని మృతులను, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. బలూచిస్థాన్‌లో గోధుమ పంట కోత పనిని పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వెళుతున్న కార్మికులను వ్యాన్ తీసుకెళుగుండగా ప్రమాదానికి గురయిందని డిప్యూటీ కమిషనర్ గజన్‌ఫర్ ఖాద్రీ తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం.

# బెంగాల్‌లో ఉపాధ్యాయుల ఆందోళన తీవ్రతరం



**కొల్‌కతా :** సుప్రీంకోర్టు తీర్పుతో తొలగించబడిన ఉద్యోగుల్లో అర్హత, అనర్హత అభ్యర్థులతో జాబితాను ప్రకటిస్తామని హామీ ఇచ్చిన పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (డబ్ల్యూబిఎస్ఎస్‌సి) నేటికీ ఆ హామీ నెరవేర్చలేదు. దీంతో రాష్ట్రంలో తొలగించబడిన బోధన, బోధనేతర సిబ్బంది ఆందోళనను తీవ్రతరం చేశారు. నియామక ప్రక్రియలో అవినీతి, అక్రమాలు జరిగాయని పేర్కొంటూ 26 వేలకు పైగా ఉద్యోగులను ఈ నెల 3న సుప్రీంకోర్టు తొలగించింది. వీరిలో అర్హత కలిగిన ఉద్యోగులు డిసెంబరు 31న వరకూ తమ ఉద్యోగాల్లో కొనసాగవచ్చునని తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ నెల 11న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు, డబ్ల్యూబిఎస్ఎస్‌సి చైర్మన్ సిద్ధార్థ మజుందర్, పశ్చిమ బెంగాల్ సెకండరీ విద్యాశాఖ బోర్డు అధ్యక్షులు రమనౌజ్ గంగోపాధ్యాయ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తరువాత ఈ నెల 21న అర్హుల, అనర్హుల జాబితాను ప్రకటిస్తామని డబ్ల్యూబిఎస్ఎస్‌సి హామీ ఇచ్చింది. 21వ తేదీ దాటి రెండు రోజులైనా ఇంకా జాబితాను విడుదల చేయకపోవడంపై ఉద్యోగుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. డబ్ల్యూబిఎస్ఎస్‌సి, సెకండరీ విద్యాశాఖ బోర్డు కార్యాలయాల ముందు ఆందోళనలు చేస్తున్నారు. రాత్రి కూడా వీధుల్లోనే నిద్రపోతున్నారు. దీంతో భారీస్థాయిలో పోలీసు బందోస్తును ఏర్పాటు చేశారు. ఉద్యోగులు వెనక్కితగ్గడం లేదు. 'మమ్మల్ని కాల్చి చంపండి. ఈ అవమానం, బాధతో మేం జీవించలేం' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాబితాను వెల్లడిరచే వరకూ ఆందోళనను విరమించబోమని చెబుతున్నారు. ఉద్యోగులు సుజోరు సర్దార్, ప్రలరు జమాదార్, కౌసిక్ రంజన్ మండల్, మౌమితా బిశ్వాస్, శ్యాంసుందర్ ఆహార్య, అసిత్ కుమార్ ఆరి, రాజశ్రీ బసక్, అసిత్ బారురు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరి ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు సహచరులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై బెంగాల్ ప్రభుత్వ సందిగ్ధతను తొలగించబడిన ఉద్యోగులతో పాటు, పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించిన ప్రభుత్వం ఉద్యోగుల్లో విభజనలు తేవడానికి ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.





## స్టార్ డైరెక్టర్‌కి హీరో దొరికాడు..
# విలన్ కోసం జంకు!


'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో గాడిన పడ్డట్లే పడి.. ఆ తర్వాత 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాలతో ఎదురు దెబ్బలు తిన్నాడు సీనియర్ డైరెక్టర్ పూరి జగన్నాథ్. మామూలుగా చివరి చిత్రం ఫలితం ఎలా ఉన్నా.. వెంటనే తర్వాతి చిత్రాన్ని మొదలుపెట్టేస్తుంటాడు పూరి. కానీ ఈసారి మాత్రం ఇబ్బంది తప్పలేదు. టాలీవుడ్ స్టార్లలో ఎవ్వరూ ఆయనతో సినిమా చేయడానికి రెడీగా లేని పరిస్థితి. నిర్మాత దొరకడమూ కష్టమైంది. ఐతే విజయ్ సేతుపతి లాంటి విలక్షణ నటుడికి కథ చెప్పి మెప్పించడంతో పూరి మళ్లీ ప్రేక్షకులతో పాటు నిర్మాతల దృష్టిని కూడా ఆకర్షించగలిగాడు. ఈ కలయికలో త్వరలోనే సినిమా సెట్స్ మీదికి వెళ్లబోతోంది. టబు, రాధికా ఆప్టే లాంటి ఆర్టిస్టులు ఈ ప్రాజెక్టులోకి రావడంతో క్రేజ్ ఇంకా పెరిగింది. మరోవైపు సినిమాలో అత్యంత కీలకమైన విలన్ పాత్ర కోసం సరైన నటుడిని ఎంచుకోవాలని చూస్తున్నాడు పూరి. అందుకోసం ఆయన ఫస్ట్ ఛాయిస్ ఫాహద్ ఫాజిల్ అట. అతడికి పూరి కథ కూడా చెప్పాడు. అతడికి నచ్చిందని సమాచారం. కానీ సౌత్ ఇండియాలో బిజీయెస్ట్ యాక్టర్లలో ఒకడైన ఫాహద్.. ఈ సినిమాకు డేట్లు సర్దుబాటు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడట. ఇంతకుముందు సేతుపతి, ఫాహద్ కలిసి 'విక్రమ్'లో నటించారు. ఈ కాంబో బాగా వర్కవుట్ అయింది. అందులో సేతుపతి విలన్‌గా చేశాడు. ఫాహద్‌ది సహాయ పాత్ర. కానీ ఈసారి అతను హీరోగా నటిస్తే.. ఫాహద్ విలన్ పాత్ర చేయాల్సి ఉంది. ఈ కలయిక మరింత ఆసక్తిని రేకెత్తిస్తుందనడంలో సందేహం లేదు. ఐతే పూరి ఎవరి కోసం ఎక్కువ రోజులు ఎదురు చూసే రకం కాదు. అందుకోసం ప్రత్యామ్నాయాలు కూడా చూసి పెట్టుకున్నాడు. 'యానిమల్'తో వెలుగులోకి వచ్చి 'పుష్ప-2'లోనూ నటించిన సౌరభ్ సచ్‌దేవా పేరునూ పరిశీలిస్తున్నాడు. కానీ ఫాహద్ చేస్తే ఈ సినిమా క్రేజే వేరుగా ఉంటుంది. మరి అతను డేట్లు సర్దుబాటు చేస్తాడా లేదా అన్నదే చూడాలి.



## వెంకీ, నాని
# మల్టీస్టారర్ మిస్సయ్యిందా

పైన హెడ్డింగ్ చదవగానే అరే మిస్సయ్యామే అనే ఫీలింగ్ ఎవరికైనా కలుగుతుంది. అలాంటిదే అభిమానులు ఎదురు చూస్తున్న విక్టరీ వెంకటేష్, న్యాచురల్ స్టార్ నాని కలయిక. హిట్ 3 ది థర్డ్ కేస్ ప్రమోషన్లలో భాగంగా బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నాని ఈ విశేషం పంచుకున్నాడు. దాని ప్రకారం ఈ కాంబినేషన్ తో దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సినిమా అనుకున్నారట. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఎందుకనేది తెలియదు కానీ ఈ మధ్య మాటల మాంత్రికుడిని కలిసే సందర్భం రాలేదు కాబట్టి ఇంతకన్నా ప్రస్తుతానికి ఏం చెప్పలేనని, ఏం జరుగుతుందో తెలియదని అక్కడితో టాపిక్ ముగించాడు. అంటే కొద్దివారాల క్రితం త్రివిక్రమ్ ఇలాంటి ప్లానింగ్ లో ఉన్నాడనే లీక్ వచ్చినప్పుడు నిజమా కాదా అనే సందిగ్ధత ఫ్యాన్స్ లో ఉండిపోయింది. అయితే అది వెంకీ, నానితో కలిసి అనేది మాత్రం ఎవరూ ఊహించలేదు. అల్లు అర్జున్ 23 కోసం స్క్రిప్ట్ పనుల్లో ఉన్న త్రివిక్రమ్ దీనికన్నా ముందు బన్నీ అట్లీ సినిమా పూర్తి చేయాలి కాబట్టి ఎక్కువ సమయం దొరికే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అప్పటి దాకా వెయిట్ చేయడం కన్నా ఈలోగా ఒక ప్రాజెక్టు చేసేయొచ్చనే ఆలోచనలో ఆయన ఉన్నట్టు టాక్ వచ్చింది. నేరుగా త్రివిక్రమ్ నే అడుగుదామంటే వేరే ఈవెంట్లకు సైతం గెస్టుగా రానంత బిజీగా ఉండటంతో సాధ్యం కాలేదు. సరే ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో ఈ కాంబో కుదిరితే బాగుంటుంది. భలే భలే మగాడివోయ్ నాని, నువ్వు నాకు నచ్చావ్ వెంకటేష్ తో కలిసి మల్లేశ్వరి మార్కు ఎంటర్ టైన్మెంట్ త్రివిక్రమ్ డైరెక్షన్లో ఇస్తే ఆ ఫన్ వేరే లెవెల్ లో ఉంటుంది. నాని ఎదురు చూస్తున్నాడు కానీ ఇప్పట్లో జరిగేలా లేదు. హిట్ 3 ది థర్డ్ కేస్ తర్వాత ప్యారడైజ్ చేయబోతున్న నాని ఆ తర్వాత సుజీత్ తో చేతులు కలుపుతాడు. కాకపోతే పవన్ కళ్యాణ్ ఓజిని పూర్తి చేసుకుని వచ్చే కండిషన్ తో. ఎలాగూ అది ఈ ఏడాదే రిలీజ్ అవుతుంది కనక రూట్ క్లియర్ గా ఉంది. ఏది ఏమైనా నాని ప్లానింగ్ చూస్తుంటే మాత్రం మిగిలినోళ్లకు ముచ్చటగా, ఈర్ష్యగా అనిపిస్తుంది.

## ఫౌజీ హీరోయిన్ మీద వివాదమెందుకు



యావత్ దేశాన్ని కుదిపేసిన పెహల్గామ్ సంఘటన తర్వాత ఊహించని కోణాల్లో వివాదాలు తలెత్తున్నాయి. తాజాగా ప్రభాస్ ఫౌజీ ద్వారా హీరోయిన్ గా పరిచయమవుతున్న ఇమాన్వి ఇస్మాయిల్ పేరు తెరమీదకు వస్తోంది. ఈమె తండ్రి మాజీ పాకిస్థాన్ మిలిటరీ అధికారి కాబట్టి శత్రుదేశం మూలాలున్న ఈ అమ్మాయిని ప్రోత్సహించకూడదనే కోణంలో పలువురు నిరసన స్వరం వినిపిస్తున్నారు. నిజానికి ఇమాన్వి పుట్టి పెరిగింది ఢిల్లీలో. అక్కడే చదువుకుని మోడలింగ్, నటన, కొరియోగ్రఫీ వగైరాలు నేర్చుకుంది. సామజిక మాధ్యమాల్లో తనకు మిలియన్లలో ఫాలోవర్లున్నారు. దర్శకుడు హను రాఘవపూడి అవి చూసే ఎంపిక చేసుకున్నాడు.అయితే ఇమాన్వికి సంబంధించిన పక్కా ఆధారాలు అందుబాటులో లేకపోవడంతో ఎక్స్ లాంటి ప్లాట్ ఫార్మ్స్ లో ఎవరైనా ఏదైనా పోస్ట్ చేస్తే అది నిజమనుకునేంతగా వైరల్ అవుతోంది. ఆమె కుటుంబ నేపథ్యం ఒకవేళ నిజంగా పాకిస్థానే అయినా ఇక్కడ పుట్టిపెరిగింది కాబట్టి తనను కాంట్రావర్సి కోణంలో చూడాల్సిన అవసరం లేదనేది ఒక కోణం. అదే పనిగా పక్క దేశానికి వెళ్లి అక్కడి నటీనటులను తీసుకొచ్చి ఇక్కడ ప్రోత్సహిస్తే అప్పుడు తప్పవుతుంది కానీ ఢిల్లీ అమ్మాయిని ఎంకరేజ్ చేయడంలో లోతైన శల్యపరీక్ష అవసరం లేదనేది ఇంకో వర్షన్. ఏది ఏమైనా సున్నితమైన వాతావరణంలో చిన్న విషయం సైతం పెద్దవుతోంది. అగ్రిమెంట్ టైంలో చేసుకున్న ఒప్పందం వల్ల ఇమాన్వి ఇంకా కొత్త సినిమాలేవి సంతకం చేయలేదు. ఫౌజీ రిలీజయ్యాక ఆఫర్లు వెల్లువెత్తుతాయనే అంచనాలు ఇండస్ట్రీగా బలంగా ఉన్నాయి. హను రాఘవపూడి బ్రేక్ ఇచ్చిన మెహ్రీన్, మృణాల్ ఠాకూర్, లావణ్య త్రిపాఠి లాంటి వాళ్ళు అలా కెరీర్ ఏర్పరుచుకున్న వాళ్లే. కానీ ఇమాన్వి కేసు వేరు. ఎంట్రీనే ప్రభాస్ లాంటి ప్యాన్ ఇండియా హీరోతో పడిరది. బ్లాక్ బస్టర్ పడితే బాలీవుడ్ లోనూ డిమాండ్ పెరుగుతుంది. మరి ఇప్పుడీ పాక్ ముద్ర గురించి జరుగుతున్న చర్చ ఎక్కడి దాకా వెళ్తుందో చూడాలి. ఫౌజీని వచ్చే ఏడాది 2026లో విడుదల చేసేందుకు మైత్రి సంస్థ ప్లాన్ చేస్తోంది.

## కథే ప్రధాన హీరో..


త్రినాథరావు నక్కిన నిర్మాణంలో 'చౌర్య పాఠం' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఇంద్ర రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. నిఖిల్ గొల్లమారి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఏప్రిల్ 25న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఇంద్ర రామ్ సినిమా విశేషాలను పంచుకున్నారు. 'నా స్వస్థలం విజయవాడ. అక్కడే చదువుకున్నాను. ఢిల్లీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. చదువుతో పాటు జిమ్నాస్టిక్స్, డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. త్రినాథరావు నక్కిన ఈ నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు తెలిసి, వారిని కలిశాను. అలా ఈ ప్రయాణం మొదలైంది. ఈ సినిమాలో కథే ప్రధాన హీరో. ఇది సాధారణ చిత్రం కాదు. కథా రచయిత కార్తిక్ తండ్రి ఐజీగా పనిచేశారు. ఆయన ఒక వాస్తవ సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందించారు. ఒక వీధిలో బ్యాంక్ ఉంటే, మరో వీధిలో గదిని అద్దెకు తీసుకొని, అక్కడ నుంచి టన్నెల్ తవ్వి బ్యాంక్‌లోకి చొరబడిన ఘటన జరిగింది. ఇలాంటి సినిమాకు సరిపడే రిఫరెన్స్‌లు సులభంగా దొరకవు. ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర ఈ చిత్రంలో టన్నెల్‌స్‌ను సృష్టించడానికి చాలా శ్రద్ధ తీసుకున్నారు. నేను హీరోగా మాత్రమే కాకుండా, కీలక పాత్రలు కూడా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. విజరు సేతుపతి గారు ట్రైలర్ చూసి, ఈ సినిమాను తమిళంలో కూడా విడుదల చేయాలని సూచించారు. సెన్సార్ సభ్యులు సినిమాను ప్రశంసించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది' అని చెప్పారు.

## సితారే జమీన్ పర్.. ఈసారి కన్నీళ్లు కాదు



ఆమిర్ ఖాన్ కెరీర్లో ఎన్నో బ్లాక్ బస్టర్లు ఉన్నాయి. కానీ ఆయన సినిమాల్లో 'తారే జమీన్ పర్' చాలా స్పెషల్. నటుడిగా మాత్రమే కాక దర్శకుడిగానూ తనదైన ముద్ర వేసిన సినిమా అది. ఆమిర్ డైరెక్ట్ చేసిన ఏకైక చిత్రమిది. తొలి చిత్రమే అయినా.. భావోద్వేగాలను అద్భుతంగా పండిరచి మెప్పించాడు. ఆ సినిమా చూసి కన్నీళ్లు పెట్టని వాళ్లుండరు అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా పతాక సన్నివేశాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే అత్యంత గొప్ప చిత్రాల్లో ఒకటిగా 'తారే జమీన్ పర్' గుర్తింపు తెచ్చుకుంది. ఆమిర్ హీరోగా పీక్స్‌లో ఉండగా ఈ సినిమా తీసి దర్శకుడిగా కూడా గొప్ప పేరు సంపాదించాడు.ఐతే ఇప్పుడు హీరోగా ఎన్నడూ లేని స్లంప్ చూస్తున్న దశలో ఆమిర్ మళ్లీ మెగా ఫోన్ పట్టాడు. 'తారే జమీన్ పర్'కు కొనసాగింపుగా 'సితారే జమీన్ పర్' తీస్తున్నాడు. ఈ సినిమా గురించి తొలిసారి ఓపెన్ అయ్యాడు ఆమిర్. 'తారే జమీన్ పర్' లాగా ఇది ఎమోషనల్ సినిమా కాదని ఆమిర్ చెప్పడం విశేషం. ఆ సినిమాలో ప్రేక్షకులను ఏడిపించామని.. ఈ సినిమాలో నవ్వించడమే ప్రధాన లక్ష్యమని ఆమిర్ తెలిపాడు. ''సితారే జమీన్ పర్ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ కథ దివ్యాంగుల నేపథ్యంలో నడుస్తుంది. 'తారే జమీన్ పర్' మిమ్మల్ని ఏడిపించింది. కానీ 'సితారే జమీన్ పర్' నవ్విస్తుంది. తొలి చిత్రంలో నేను సున్నితమైన భావాలున్న వ్యక్తిగా నటించాను. కానీ ఇందులో నా పాత్ర భిన్నంగా, పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. నా పాత్ర రాజకీయ నాయకులతో దురుసుగా ప్రవర్తిస్తుంది. కుటుంబ సభ్యులతోనూ గొడవపడి అవమానిస్తుంటుంది. ఎన్నో అంతర్గత సమస్యలతో బాధ పడే వ్యక్తి మంచివాడిగా ఎలా మారాడన్నదే ఈ కథ'' అని ఆమిర్ తెలిపాడు. ఈ ఏడాది ద్వితీయార్థంలో 'సితారే జమీన్ పర్' విడుదలవుతుంది.

## ఉగ్రదాడిపై సాయి పల్లవి ట్వీట్..



జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని సినీతారలు ఖండిస్తున్నారు. ఈ ఘటనలో 27 మంది చనిపోవడం ఎంతో బాధాకరమంటూ ట్వీట్స్ చేశారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ లోయలో జరిగిన రక్తపాతంపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. అటు ప్రపంచ దేశాలు సైతం భారత్ కు అండగా నిలబడుతున్నాయి. ఇప్పటికే ఈ ఘటనపై టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలకు చెందిన స్టార్స్ రియాక్ట్ అయ్యారు. తాజాగా న్యాచురల్ బ్యూటీ సాయి పల్లవి సైతం ఉగ్రదాడి పై స్పందిస్తూ నెట్టింట సుదీర్ఘ ట్వీట్ చేసింది. దీంతో గతంలో ఆమెకు సంబంధించిన ఓ ఇంటర్వ్యూ వీడియోనూ నెట్టింట షేర్ చేస్తూ మండిపడుతున్నారు నెటిజన్స్. ఇంతకీ అసలే జరిగిందంటే.. ఉగ్రదాడిపై సాయి పల్లవి స్పందిస్తూ.. ''పహల్గాం దాడిలో జరిగిన నష్టం, కలిగిన బాధ, ఏర్పడిన భయం నాకు వ్యక్తిగతంగా జరిగినట్లు అనిపిస్తోంది. చరిత్రలో జరిగిన భయంకరమైన నేరాల గురించి తెలుసుకుని.. ఇప్పటికీ అలాంటి అమానవీయ చర్యలకు సాక్షిగా ఉండడం వల్ల.. అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ ఏమి మారలేదని అర్థమవుతుంది. ఆ జంతువుల సమూహం మిగిలి ఉన్న ఆ కొద్దిపాటి ఆశను తుడిచి పెట్టేసింది. కుటుంబంతో జ్ఞాపకాలను సృష్టించాలనుకునే మనస్తత్వం నుండి, మీ ఎమోషన్స్, మీ కుటుంబం మీ ముందే కోల్పోవడం చూడడం వరకు.. ఇది నన్ను మన మూలాన్ని ప్రశ్నించేలా చేస్తుంది. నిస్సహాయంగా, శక్తిహీనులుగా, కోల్పోయిన అమాయక జీవితాలు, వేదనకు గురైన కుటుంబాల కోసం నా హృదయపూర్వక సంతాపాన్ని, ప్రార్థనలను అందిస్తున్నాను'' అంటూ ట్వీట్ చేసింది.

## ఓటీటీలోకి మలయాళీ సినిమా..




ఇటీవల మలయాళీ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన చిత్రాల్లో ఎల్ 2 ఎంపురాన్ ఒకటి. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రానికి హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించారు. 2019లో విడుదలై సూపర్ హిట్ అయిన లూసిఫర్ చిత్రానికి సీక్వెల్ గా ఈ మూవీని రూపొందించారు. డ్రగ్స్, ఇంటర్నేషనల్ మాఫియా, ఫ్యామిలీ ఎమోషన్స్, రాజకీయాలు వంటి అంశాల చుట్టూ ఈ చిత్రాన్ని చిత్రీకరించారు. ఇందులో మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలలో నటించారు. థియేటర్లలో విడుదలైన కొన్ని రోజులకే ఈ సినిమా వివాదాల్లో చిక్కుకుంది. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ థియేటర్లలో ఏకంగా రూ.262 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇన్నాళ్లు థియేటర్లలో విజయవంతగా అలరించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా మలయాళంతోపాటు తెలుగు, హిందీ, కన్నడ, తమిళ భాషలలో ఈ సినిమాను విడుదల చేయగా అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. రూ.180 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కించిన ఈసినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.262 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. కేవలం దేశంలోనే రూ.121 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఈ చిత్రానికి అంతగా రెస్పాన్స్ రాలేదు. ప్రస్తుతం ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చేసింది. తెలుగుతోపాటు మలయాళం, తమిళం, కన్నడ, హిందీ భాషలలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. కథ విషయానికి వస్తే.. ఐయూఎఫ్ పార్టీలో సమస్యలన్నీ సద్దుమణిగిలే చేసిన స్టీపెన్ నెడుంపల్లి (మోహన్ లాల్) అజ్ఞాతనంలోకి వెళ్తాడు. పార్టీ పగ్గాలు, అధికారం చేతికొచ్చిన తర్వాత జతిన్ రామ్ దాస్ (టొవినో థామస్) భారీగా అవినీతి చేస్తాడు. తన సోదరుడు చేస్తున్న అవినీతిని ఎదురించడానికి స్టీపెన్ మళ్లీ రంగంలోకి దిగుతాడు. దీంతో ఇద్దరు అన్నదమ్ముల మధ్య పొలిటికల్ వార్ స్టార్ట్ అవుతుంది. అది కాస్త జాతీయ స్థాయిలోకి వెళ్తుంది. అటు రాజకీయ అంశాలతోపాటు ఇంటర్నేషనల్ డ్రగ్స్ మాఫియాను టచ్ చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బెంగళూరులో రాజస్థాన్‌పై థ్రిల్లింగ్ విజయం

## హర్షల్ పటేల్ మ్యాజిక్‌తో మ్యాచ్ టర్న్





ఐపీఎల్ 18లో సొంతమైదానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఎట్టకేలకు విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్తో జరిగిన ఉత్కంఠ పోరులో బెంగళూరు 11 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (70), పడిక్కల్ (50) అర్ధశతకాలతో చెలరేగారు. అనంతరం బ్యాటింగ్కు దిగిన రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (49; 19 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు), ధ్రువ్ జురెల్ (47; 34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) పోరాడినప్పటికీ.. చివర్లో ఆ జట్టు బోల్తాపడింది. నితీశ్ రాణా (28), రియాన్ పరాగ్ (22; 10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్ లు), వైభవ్ సూర్యవంశీ (16), హెట్మయర్ (11) పరుగులు చేశారు. చివరి రెండు ఓవర్లలో రాజస్థాన్ లక్ష్యం 18 పరుగులు కాగా, హేజిల్వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 19వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. చివరి ఓవర్లో లక్ష్యం 17 పరుగులు కాగా, యశ్ దయాల్ వికెట్ తీసి కేవలం 5 పరుగులే ఇచ్చాడు. బెంగళూరు బౌలర్లలో హేజిల్ వుడ్ 4, కృనాల్ పాండ్య 2, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ ఒక్కో వికెట్ తీశారు.

**జైస్వాల్ మెరుపులు..**

లక్ష్యఛేదనలో యశస్వి చెలరేగడంతో రాజస్థాన్కు అదిరే ఆరంభం దక్కింది. భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్స్ బాది తన ఉద్దేశాన్ని చాటాడు. యశ్ దయాళ్ వేసిన రెండో ఓవర్లో జైస్వాల్ రెండు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. హేజిల్వుడ్ వేసిన నాలుగో ఓవర్ లో హ్యాట్రిక్ బౌండరీలు బాదేశాడు. తర్వాత భువీ బౌలింగ్లో సిక్స్ కొట్టిన వైభవ్.. నెక్స్ బాల్కే క్లీన్బౌల్డ్ అయ్యాడు. హేజిల్వుడ్ వేసిన ఆరో ఓవర్లో వరుసగా 4, 4, 6 బాదిన జైస్వాల్.. తర్వాత బంతికే షెఫర్డ్కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో పవర్ ప్లే ముగిసేసరికి రాజస్థాన్ 72/2తో నిలిచింది. రియాన్ పరాగ్ క్రీజులో కొద్దిసేపే ఉన్నా ధాటిగా ఆడాడు. షెఫర్డ్ బౌలింగ్లో ఫోర్, సిక్స్.. సుయాశ్ తర్వాతి ఓవర్లో 6, 4 బాదాడు. దీంతో 8 ఓవర్లకే స్కోరు 99/2కి చేరింది. దూకుడుగా ఆడుతున్న పరాగ్ను కృనాల్ పాండ్య తన స్పెల్లో తొలి బంతికే వెనక్కి పంపాడు. తర్వాత స్కోరు కాస్త నెమ్మదించింది. కృనాల్ తన మూడో ఓవర్లో నితీశ్ రాణాను ఔట్ చేశాడు. అప్పటికీ స్కోరు 134/4 (13.3 ఓవర్లు). తర్వాత క్రీజులోకి వచ్చిన జురెల్ దూకుడుగా ఆడటంతో రాజస్థాన్ 16 ఓవర్లకు 160 పరుగులు చేసి విజయం దిశగా సాగింది.

**మ్యాచ్ను మలుపుతిప్పిన హేజిల్ వుడ్**

విజయం దిశగా పయనిస్తున్న రాజస్థాన్కు హేజిల్వుడ్ గట్టిదెబ్బతీశాడు. 17వ ఓవర్లో ఆరు పరుగులే ఇచ్చి హెట్మయర్ని ఔట్ చేశాడు. భువనేశ్వర్ వేసిన తర్వాతి ఓవర్ లో జురెల్ రెండు ఫోర్లు, ఒక సిక్స్.. శుభమ్ దూబె (12) ఒక సిక్స్ కొట్టడంతో రాజస్థాన్ మళ్లీ రేసులోకి వచ్చింది. మళ్లీ బంతి అందుకున్న హేజిలవ్వుడ్ 19 ఓవర్ లో కేవలం ఒకే పరుగు ఇచ్చి వరుస బంతుల్లో జురెల్, ఆర్చర్ను పెవిలియన్కు పంపాడు. చివరి ఓవర్ (యశ్ దయాల్)లో రాజస్థాన్ విజయ సమీకరణం 17 పరుగులు కాగా.. తొలి బంతికి శుభమ్ దూబె ఫిల్ సాల్ట్కు చిక్కడంతో రాజస్థాన్ ఆశలు ఆవిరయ్యాయి. మూడో బంతికి హసరంగ రనౌటయ్యాడు.

### మెరిసిన కోహ్లి, పడిక్కల్

టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన బెంగళూరుకు సాల్ట్ (26; 23 బంతుల్లో 4 ఫోర్లు), కోహ్లి (70; 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సు) శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్లో కోహ్లి వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్పాండేకు వరుసగా రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి ఆర్సీబీ 59/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్లో ఫిల్ సాల్ట్ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు. అనంతరం పడిక్కల్ (50, 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సు)తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్ లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్లో కోహ్లికిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్పాండే వేసిన 15 ఓవర్లో పడిక్కల్ రెండు సిక్స్లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్లో కోహ్లి ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు ఆర్సీబీ 156/1తో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో బెంగళూరు మూడు వికెట్లు కోల్పోయింది. కోహ్లిని ఆర్చర్ ఔట్ చేయగా.. సందీప్ ఒకే ఓవర్లో పడిక్కల్, రజత్ పటీదార్ (1)ని వెనక్కి పంపాడు. జితేశ్ శర్మ (20*;10 బంతుల్లో 4 ఫోర్లు), టిమ్ డేవిడ్ (23; 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో చివరి మూడు ఓవర్లలో 38 పరుగులు రాబట్టింది. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ 2, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు.

# ప్లేఆఫ్స్ ముందు ప్రత్యర్థులకు మరణ శాసనమే

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన 41వ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్ రోహిత్ శర్మ అద్భుతమైన హాఫ్ సెంచరీతో మాంచి ఇన్నింగ్స్ ఆడాడు. అతను వరుసగా రెండవ మ్యాచ్‌లో అర్ధశతకం సాధించాడు. అంతకుముందు ఏప్రిల్ 20న, చెన్నై సూపర్ కింగ్స్‌పై 76 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ పలు రికార్డులు బద్దలుకొట్టాడు. ఇక ఈ సీజన్ ప్రారంభ మ్యాచ్‌లలో ఫెయిల్ అవుతూ వచ్చిన రోహిత్.. సరిగ్గా పీక్ అయ్యే టైంలో రెచ్చిపోయి మరీ ఆడుతుండటంతో ప్రత్యర్థుల్లో వణుకు పుట్టకతప్పదు. ఈ సీజన్‌లో రోహిత్ శర్మ వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించాడు. అంతకుముందు, అతను చెన్నై సూపర్ కింగ్స్‌పై 76 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. ఇక 2016లో కూడా ఇలాంటి తరహా ఘనత సాధించాడు. ఆ సమయంలో అతడు వరుసగా రెండు ఇన్నింగ్స్‌లలో అర్ధ సెంచరీలు సాధించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను 46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 70 పరుగులు చేశాడు. ఇక ఈ సీజన్‌లో అతని ప్రదర్శన గురించి మాట్లాడుకుంటే, 8 మ్యాచ్‌లలో 35.33 సగటుతో 212 పరుగులు చేశాడు. ఇందులో రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. రోహిత్ శర్మ టీ20ల్లో 12,000 పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించడంలో తక్కువ బంతులు ఎదుర్కొని విరాట్ కోహ్లీని వెనక్కినెట్టాడు. విరాట్ కోహ్లీ 8997 బంతులు ఆడి 12000 పరుగులు పూర్తి చేశాడు. రోహిత్ శర్మ 8885 బంతులు ఆడి ఈ ఘనత సాధించాడు. అతి తక్కువ బంతుల్లో 12000 పరుగులు పూర్తి చేసిన రికార్డు కీరన్ పొలార్డ్ పేరిట ఉంది. అతను కేవలం 7992 బంతులు ఆడి 12000 పరుగులు పూర్తి చేశాడు. దీని తర్వాత క్రిస్ గేల్ 8100 బంతులు ఆడి 12000 పరుగులు చేశాడు. హేల్స్ 8191 బంతులు ఆడి ఈ ఘనత సాధించాడు. జోస్ బట్లర్ 8261 బంతులు ఆడి 12000 పరుగులు పూర్తి చేశాడు. డేవిడ్ వార్నర్ 8563 బంతులు ఆడి 12000 పరుగులు సాధించాడు. విరాట్ కోహ్లీ తర్వాత షోయబ్ మాలిక్ ఈ కోవలోకి వస్తాడు. అతను 9424 బంతులు ఆడి 12000 పరుగులు పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో సిక్సర్ల పరంగా రోహిత్ శర్మ కీరన్ పొలార్డ్‌ను వెనక్కి నెట్టాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై అతను 3 సిక్సర్లు బాదాడు. దీంతో అతను ముంబై ఇండియన్స్ తరపున అత్యధికంగా 259 సిక్సర్లు కొట్టి కీరాన్ పొలార్డ్(258 సిక్సర్లు) రికార్డును బ్రేక్ చేశాడు.

# దూసుకొస్తున్న ముంబయి

సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ల ఆటతీరు మారలేదు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించ లేకపోతున్న హైదరాబాద్ బ్యాటర్లు.. ఉప్పల్ వేదికగా ముంబయి ఇండియన్స్‌తో జరిగి న లీగ్ మ్యాచ్‌లోనూ నిరాశపరి చారు. దీంతో ముంబయి చేతిలో ఏడు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడారు. తొలుత ముంబయి బౌలర్లు సమిష్టిగా రాణించడంతో 143పరుగులకే పరిమితమైన సన్‌రైజర్స్ జట్టు.. ఆ లక్ష్యాన్ని కాపాడుకోలేక 15.4ఓవర్లలోనే ముంబయి చేతిలో చిత్తుగా ఓడిరది. ఓపెనర్ రోహిత్ శర్మ(70), సూర్యకుమార్ యాదవ్(40నాటౌట్) ముంబయి గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఈ గెలుపుతో ముంబయి జట్టు వరుసగా నాల్గో విజయాన్ని సొంతం చేసుకొని పాయింట్ల పట్టికలో మూడోస్థానానికి ఎగబాకింది. తొలుత హైదరాబాద్ జట్టు 13పరుగులకే 4వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిరది. విధ్వంసక ఓపెనర్ ట్రావిస్ హెడ్(0)ను బౌల్ట్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్(1) సైతం దీపక్ చాహర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ రికెల్టన్ చేతికి చిక్కాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే.. అభిషేక్ శర్మ(8), నితీశ్ కుమార్ రెడ్డి(2)లు పేలవ షాట్లతో పెవిలియన్‌కు క్యూ కట్టారు. దాంతో, 14 పరుగులకే కమిన్స్ సేన నలుగురు ప్రధాన ఆటగాళ్ల వికెట్లు కోల్పోయింది. ఆ దశలో క్లాసెన్(71) అర్ధసెంచరీకి తోడు.. అభినవ్ మనోహర్(43) ఆచి తూచి ఆడారు. ఈ ఓటమితో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్ ఆశలు సంక్లిష్టంగా మారాయి.

# పహల్గామ్ దాడిలో పాక్ హస్తం.. బయట పెట్టిన ఆ దేశ మాజీ క్రికెటర్


జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి పై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ భయంకరమైన దాడిలో 28 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నామని పాకిస్తాన్ మద్దతుగల ఎల్ఇటిటిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. కాగా ఈ ఉగ్రవాద దాడి వెనుక పాక్ హస్తం ఉందని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా ఆరోపించాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేసిన కనేరియా.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోన్నందుకు పాకిస్తాన్ సిగ్గుపడాలన్నాడు. ఇందులో పాక్ పాత్ర లేకుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నారని డానిష్ ప్రశ్నించాడు. కాగా పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం వైపు నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి. దౌత్యపరంగా భారత ప్రభుత్వం పాకిస్తాన్ తో సంబంధాలను తెంచుకుంది. ఇందులో భాగంగానే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇంతలో అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలు, అగ్ర నాయకులు పహల్గామ్ దాడిని ఖండిరచారు. ఉగ్రవాదం నిర్మూలనలో భారత దేశానికి సహకరిస్తామని ప్రకటించారు.



అయితే, ఈ దురాగతాన్ని ఖండిస్తూ పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఇప్పుడు దీనినే తప్పుపట్టాడు పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా. పహల్గామ్ దాడిపై సందేహాలు వ్యక్తం చేసిన డానిష్ కనేరియా.. 'ఈ దాడిలో పాకిస్తాన్ హస్తం నిజంగా లేకుంటే, మన ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ ఈ విషయం గురించి ఎందుకు స్పందించడం లేదు? అలాగే భారతదేశంలో దాడి జరిగినప్పుడు పాకిస్తాన్ సైన్యాన్ని అకస్మాత్తుగా హై అలర్ట్‌లో ఉండాలని ఎందుకు చెప్పారు? ఎందుకంటే మీకు నిజం తెలుసు. మీరు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. వారిని పెంచి పోషిస్తున్నారు. ఇందుకు మీరు సిగ్గుపడాలి' అని డానిష్ కనేరియా సోషల్ మీడియా ద్వారా పాకిస్తాన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు.

# ఇండియన్ హెడ్ కోచ్‌కి డెత్ వార్నింగ్ పంపిన ఐసిస్ ఉగ్రవాదులు!

భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు 'ఐసిస్ కాశ్మీర్' నుండి హత్య బెదిరింపులు రావడం ఇటు క్రికెట్ పరంగా అటు దేశ భద్రత పరంగా కలకలం రేపింది. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 28 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన ఘటన నేపథ్యంలో, గంభీర్‌కు ఈ బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. ''నేను నిన్ను చంపేస్తాను'' అనే వ్యాఖ్యలతో కూడిన ఈమెయిల్‌ను గంభీర్‌కు పంపారని ఇండియా టుడే నివేదించింది. మంగళవారం ఉగ్రదాడి జరిగిన తర్వాత బుధవారం ఉదయం గంభీర్ ఢల్లీపోలీసులను ఆశ్రయించి తన కుటుంబానికి పూర్తి భద్రత కల్పించాలని అధికారిక ఫిర్యాదు చేశారు. మాజీ బీజేపీ ఎంపీ అయిన గంభీర్ ప్రస్తుతం టీం ఇండియా ప్రధాన కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి గంభీర్ తీవ్రంగా స్పందిస్తూ తన సోషల్ మీడియా ఖాతా శ (ట్విట్టర్) ద్వారా ''మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నాను అని దీనికి బాధ్యులు అయిన



వారు మూల్యం చెల్లించుకుంటారు అని భారత్ ప్రతీకారం తీర్చుకుంటుంది అని వ్యాఖ్యానించారు. గంభీర్ ఇటీవలే తన కుటుంబంతో సెలవుల కోసం ఫ్రాన్స్ వెళ్లి, ఈ నెల ప్రారంభంలోనే దేశానికి తిరిగి వచ్చారు. ఐపీఎల్ 2025 జరుగుతున్న ఈ సమయంలో ప్రధాన కోచ్‌లకు విశ్రాంతి సమయం లభించే అవకాశం ఉండగా, గంభీర్ ఈ ఫేజ్‌ను వ్యక్తిగత విశ్రాంతికి ఉపయోగించుకున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం జూలైలో టీం ఇండియా ప్రధాన కోచ్‌గా నియమితుడైన గంభీర్, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్థానాన్ని భర్తీ చేశారు. కోచ్‌గా తన ప్రయాణంలో కొన్ని కఠినమైన దశలను కూడా గంభీర్ ఎదుర్కొన్నారు. శ్రీలంకతో వన్డే సిరీస్, న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లలో భారత్ ఓటమిని చవిచూడగా, ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీని కూడా గంభీర్ నాయకత్వంలో భారత్ కోల్పోయింది. డ్రెస్సింగ్ రూమ్ చర్చలు మీడియాకు లీక్ కావడం, భారత జట్టులో భిన్నాభిప్రాయాలు తెరపైకి రావడం వంటి సంఘటనలు గంభీర్‌పై విమర్శలు పెంచాయి. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజయం గంభీర్‌కు మళ్లీ విశ్వాసాన్ని తీసుకొచ్చింది. టీం ఇండియా ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడిరచి అజేయంగా టైటిల్ గెలుచుకుంది. ఈ విజయంతో పాటు గంభీర్ క్రికెట్‌లో తన తిరుగులేని కృషిని చూపించగలిగారు. అయితే ఇప్పుడు వచ్చిన హత్య బెదిరింపులు ఆయనకు, భారత క్రికెట్ బోర్డుకి సవాల్‌లాంటివే. భారత క్రికెట్ ప్రధాన కోచ్‌గా ఉన్న వ్యక్తికి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ నుంచి బెదిరింపులు రావడం, దేశ భద్రత వ్యవస్థను అప్రమత్తం చేస్తోంది.

# బంగ్లాకు జింబాబ్వే ఝలక్

టెస్టు క్రికెట్‌లో పసికూన జింబాబ్వే జట్టు బంగ్లాదేశ్‌కు ఝలక్ ఇచ్చింది. తొలిటెస్ట్‌లో బంగ్లాదేశ్‌పై 3 వికెట్ల తేడాతో జింబాబ్వే జట్టు విజయం సాధించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అర్ధసెంచరీకి తోడు జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబ్బాని 9 వికెట్లతో రాణించాడు. 147 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే జట్టు ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ముజరబ్బాని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్(50), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(40)ల పోరాటంతో బంగ్లాదేశ్ 191కే ఆలౌటయ్యింది. అనంతరం జింబాబ్వే. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(57), సియాన్ విలియమ్స్(59) అర్ధ సెంచరీలతో చెలరేగారు. దీంతో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులు కొట్టి 82 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా బ్యాటర్లు రాణించడంతో 255పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(54), బెన్ కరాన్ (44)లు తొలి వికెట్‌కు 95 పరుగులు జోడిరచి పటిష్ట స్థితిలో నిలిపారు. వీళ్లిద్దరి జోరుతో విజయానికి చేరువైన జింబాబ్వేను మిరాజ్(5/50) వరుసగా వికెట్లు తీసి కష్టాల్లోకి నెట్టాడు. రెండో టెస్టు ఏప్రిల్ 28న చిట్టోగ్రామ్ వేదికగా జరగనుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in